E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
హైదరాబాద్ (తేదీ) 30-08-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:236 || పేజీలు–6
www.ekaburu.com

## బొగ్గు మసిలో విరిసిన నవ్వు...



3



# బతికున్నారేమోనని!

- 2,400కు చేరిన ఆచూకీ దొరకని వారి సంఖ్య
- అందులో 287 మంది భారతీయులు
- 682కు పెరిగిన మృతుల సంఖ్య
- 4,400 మంది సురక్షితం

## నేపాల్ విలయంలో గల్లంతైన వారి కోసం వెతుకులాట

ఈకబురు, కాఠ్‌మాండూ: ఆసుపత్రుల దగ్గర పడిగాపులు.. గోడలపై వేసిన పోస్టర్లలో తమవారి కోసం వెతుకులాట.. కుప్పకూలిన భవనాల పక్కన దీనంగా జనం.. బురద, మట్టిలో తమ వస్తువుల కోసం అన్వేషణ.. శిథిలాల మధ్య చనిపోయి పడి ఉన్న జంతువులు.. గల్లంతైన తమవారు తిరిగి రావాలని ప్రార్థనలు. ఇదీ నేపాల్‌లోని ప్రస్తుత స్థితి. బుధవారం మిగతా 2లో

# 'సర్' లోపభూయిష్టం

- ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సీఎం రేవంత్ లేఖ
- అభ్యంతరాలు, నోటీసులకు సమాధానమిచ్చే గడువులను పొడిగించాలి
- 73.39 లక్షల మంది ఓటర్లను ఏఎస్‌డీడీ లిస్ట్‌లో పెట్టడం ఆందోళనకరం
- శాశ్వత, తాత్కాలిక వలసల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించలేకపోయారు
- మరో 92.86లక్షల మంది ఓటర్లకు నోటీసులు



ఈ-కబురు,

సర్‌లో చట్టబద్ధమైన నోటీసు మెకానిజమ్ లేదు. వలస వెళ్లిన కేటగిరీ కింద ఓట్లను తొలగించే ముందు ఓటర్లకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వడం లేదు. వ్యత్యాసాలు కలిగిన, లింక్ కాని ఓటర్లకు మాత్రమే నోటీసులు ఇస్తున్నారు. మళ్లీ ఎన్నికలు జరిగినప్పుడు ఓటేయడానికి పోతేనే తమ ఓటు పోయిందనే నిజం ఓటరుకు తెలుస్తుంది. మిగతా 2లో

## ఖర్గే సభావేదికను "శుద్ధీకరించిన" వారిపై ఎస్సీఎస్టీ కేసు నమోదుచేయాలి



03

ఈ-కబురు, దిల్లీ: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఈనెల 8న కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న ఒక సభావేదికను "శుద్ధీకరించిన" ఘటనకు సంబంధించి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ భాజపా-ఆర్ఎస్ఎస్‌లను తీవ్రంగా విమర్శించారు.

## సాంకేతికత, ఆవిష్కరణలే పోలీసింగ్‌కు దిక్సూచి

- యువ ఐపీఎస్ అధికారుల వినూత్న ఆలోచనలకు డిజిపి సి. వి. ఆనంద్ అభినందనలు
- కోర్టు కేసులు, న్యాయ ప్రక్రియలపై మరింత దృష్టి
- నిరంతర శిక్షణతో వృత్తి నైపుణ్యాల మెరుగుదల
- క్లస్టర్-1లో హైదరాబాద్.. క్లస్టర్-2లో రామగుండం టాప్

3



చిన్న నీటిపారుదల వ్యవస్థపై
## కీలక నివేదిక

- ముఖ్యమంత్రికి నివేదిక అందజేసిన రైతు కమిషన్
- చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం ప్రతిపాదన
- నీటి వినియోగ సామర్థ్య పెంపుపై దృష్టి
- పంటల మార్పిడి, ఎఫ్‌పీవోల ఏర్పాటుపై సీఎం సూచనలు

ఈకబురు, రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను బలోపేతం చేసి నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే దిశగా తెలంగాణ వ్యవసాయ–రైతు సంక్షేమ కమిషన్ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి శనివారం అందజేశారు. కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిసి నివేదిక సమర్పించింది. రాష్ట్రంలో



మిగతా 3లో

## తెలంగాణ–మారిషస్ సహకారానికి కొత్త ఊపు

- మంత్రి శ్రీధర్ బాబుతో మారిషస్ మంత్రి భేటీ
- ఐటీ, టూరిజం, విద్యా రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ
- నైపుణ్యాభివృద్ధి, పరిపాలనా సంస్కరణలపై ఆసక్తి
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం



2



2

## తాష్కెంట్‌లో మోదీకి ఆత్మీయ స్వాగతం




## సీబీజీ ధరల సవరణపై కేంద్రం వివరణ

3

- వినియోగదారులపై భారీ భారం కాదని స్పష్టీకరణ
- ఉత్పత్తిదారులకు స్థిరమైన ధరల మద్దతు
- గోబర్ధన్ పథకం కింద కొత్త ధర విధానం
- ప్రభుత్వ సబ్సిడీతో వినియోగదారులకు రక్షణ

## నేడే నీట్ పీజీ పరీక్ష

- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష
- రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 56 కేంద్రాలు.. 17,600 మంది అభ్యర్థులు




3

మారిషస్‌లో తెలుగు సంస్కృతి
## ప్రోత్సాహానికి సహకారం

- మారిషస్ ప్రతినిధి బృందంతో భట్టి విక్రమార్క భేటీ
- తెలుగు భాష, సంప్రదాయాల పరిరక్షణపై చర్చ
- రామ భజనం కార్యక్రమానికి తెలంగాణ మద్దతు
- ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక బంధాల బలోపేతం



3

టిమ్స్, వరంగల్ హెల్త్ సిటీ
## పనులపై సమీక్ష



2

## తెలంగాణ–మారిషస్ సహకారానికి కొత్త ఊపు



హైదరాబాద్, ఆగస్టు 29 ఈకబురు, ):
మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ మంత్రి లుచ్‌మనన్ పెంతియా శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ–మారిషస్ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఉన్న అవకాశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. పరిపాలన, టూరిజం, ఐటీ, ఐటీఈఎస్, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలు, నైపుణ్యాభివృద్ధి, విద్య వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. సమావేశంలో మారిషస్ మంత్రి లుచ్‌మనన్ పెంతియా మాట్లాడుతూ, స్వల్పకాలంలోనే అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధించిన తెలంగాణను తమ దేశం విశ్వసనీయ భాగస్వామిగా భావిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా సాంకేతికత ఆధారిత పరిపాలన, పారిశ్రామిక అభివృద్ధి, నైపుణ్య శిక్షణ రంగాల్లో తెలంగాణ సాధించిన పురోగతి తమకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. ఇరు ప్రాంతాల మధ్య సన్నిహిత సహకారం పరస్పర ప్రయోజనాలకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.
మారిషస్ ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాభివృద్ధి కోసం ఆధునిక పరిపాలనా విధానాలపై శిక్షణ అందించడంలో తెలంగాణ సహకారం కోరారు. రాష్ట్రంలోని ఎంసీహెచ్‌ఆర్డీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ఇతర ప్రముఖ విద్యా, శిక్షణా సంస్థలతో భాగస్వామ్యం ఏర్పరచుకోవాలనే ఆసక్తిని వ్యక్తం చేశారు. ప్రజా పరిపాలనలో నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో తెలంగాణ అనుభవాన్ని పంచుకోవాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, అన్ని రంగాల్లోనూ మారిషస్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులు, సాంకేతిక సహకారం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇరు ప్రాంతాల మధ్య విద్య, పరిశ్రమలు, టూరిజం, సమాచార సాంకేతిక రంగాల్లో మరింత బలమైన సంబంధాలు ఏర్పడే అవకాశాలపై కూడా చర్చించారు. పరస్పర సహకారంతో కొత్త అవకాశాలను అన్వేషించి, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి నమూనాలు, డిజిటల్ పరిపాలన విధానాలపై మారిషస్ ప్రతినిధి బృందం ప్రత్యేక ఆసక్తి కనబరిచినట్లు అధికారులు తెలిపారు. డిసెంబర్ 7, 8 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026"లో పాల్గొనాలని మంత్రి శ్రీధర్ బాబు, మారిషస్ మంత్రి లుచ్‌మనన్ పెంతియాను ఆహ్వానించారు. ఈ సమావేశంలో సెక్రటరీ ఫర్ పబ్లిక్ సర్వీస్ దేవేంద్ర గోపాల్, ఏఐపీఎస్ఐ బోర్డ్ చైర్‌పర్సన్ డాక్టర్ నికోలస్ రాగోడూ, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ దుర్బరీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీఈఅండ్‌సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## తాష్కెంట్‌లో మోదీకి ఆత్మీయ స్వాగతం



ఈకబురు,): తాష్కెంట్: భారత్‌ఉజ్బెకిస్థాన్ ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతమవడంతో పాటు దినదినాభివృద్ధి చెందుతున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. నాలుగు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా శనివారం ఆయన దిల్లీ నుంచి బయలుదేరి ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్ చేరుకున్నారు. విమానాశ్రయంలో దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ మోదీకి స్వాగతం పలికారు. పెట్టుబడులు, వాణిజ్యం తదితర అంశాల్లో సహకారంపై శని, ఆదివారాల్లో ద్వైపాక్షిక చర్చలు జరుగుతాయి. ఉజ్బెకిస్థాన్‌లోని అధికారిక కార్యక్రమాల అనంతరం మోదీ కిర్గిజిస్థాన్ చేరుకుంటారు. బిష్కెక్ నగరంలో నిర్వహించనున్న షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. భారత ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో తాష్కెంట్ నగరం త్రివర్ణ శోభితంగా మారింది. అక్కడి ఓ భవనంపై ప్రదర్శించిన భారత జాతీయ పతాకం ఆకట్టుకుంటోంది.

## టిమ్స్, వరంగల్ హెల్త్ సిటీ పనులపై సమీక్ష



హైదరాబాద్, ఆగస్టు 29 ఈకబురు, ):
రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ శనివారం టిమ్స్ ఆల్వాల్, టిమ్స్ ఎల్‌బీనగర్, వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వైద్య మౌలిక సదుపాయాల బలోపేతానికి కీలకమైన ఈ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సమావేశంలో ఆయా ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, ఎదురవుతున్న సమస్యలపై అధికారులు మంత్రికి వివరాలు అందజేశారు. నిర్మాణ పనుల నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో ప్రాజెక్టులను పూర్తి చేసే అంశాలపై చర్చించారు.
టిమ్స్ ఆల్వాల్, టిమ్స్ ఎల్‌బీనగర్ ఆస్పత్రుల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, సాంకేతిక సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వరంగల్ హెల్త్ సిటీ ప్రాజెక్టు రాష్ట్ర ఆరోగ్య రంగానికి కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అధునాతన వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని తెలిపారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు స్పష్టం చేశారు.
ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య రంగంలో భారీ పెట్టుబడులు పెడుతోందని మంత్రి అన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల ప్రతి దశను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి టిమ్స్ ఆల్వాల్, టిమ్స్ ఎల్‌బీనగర్, వరంగల్ హెల్త్ సిటీ ప్రాజెక్టులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు

# బతికున్నారేమోనని!



కాఠ్‌మాండూ: ఆసుపత్రుల దగ్గర పడిగాపులు.. గోడలపై వేసిన పోస్టర్లలో తమవారి కోసం వెతుకులాట.. కుప్పకూలిన భవనాల పక్కన దీనంగా జనం.. బురద, మట్టిలో తమ వస్తువుల కోసం అన్వేషణ.. శిథిలాల మధ్య చనిపోయి పడి ఉన్న జంతువులు.. గల్లంతైన తమవారు తిరిగి రావాలని ప్రార్థనలు. ఇదీ నేపాల్‌లోని ప్రస్తుత స్థితి. బుధవారం వరద ముంచెత్తినప్పటి నుంచి సహాయక చర్యలు కొనసాగుతున్నా.. గల్లంతైనవారి ఆచూకీ పూర్తిగా లభించడంలేదు. మృతులతో పాటు ఆచూకీ దొరకని వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఇప్పటికీ 2,400 మంది ఎక్కడ ఉన్నారో.. ఏమయ్యారో తెలియడం లేదు. వారిలో 320 మంది విదేశీయులుకాగా... భారతీయులు 287 మంది ఉన్నారు. విపత్తు సంభవించి నాలుగు రోజులు కావడంతో ఆశలు సన్నగిల్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో చిక్కుకున్న దాదాపు 4,400 మందిని సహాయక బృందాలు సురక్షిత ప్రాంతానికి తరలించగలిగాయి. అందులో 167 మంది భారతీయులు. మిగిలినవారు చైనా, ఉక్రెయిన్, జర్మనీ, మాల్టా, అమెరికా, తుర్కియే, పోర్చుగల్, రష్యా, స్పెయిన్, స్విట్జర్లాండ్, ఇటలీ, ఒమన్, బెల్జియం, బల్గేరియా దేశాలకు చెందినవారున్నారు. రహదారులు ధ్వంసం కావడంతో చాలా మందిని హెలికాప్టర్ల ద్వారానే తరలిస్తున్నారు.
మరోవైపు టిబెట్‌లో 550 మంది ఆచూకీ తెలియడం లేదు. నేపాల్‌లో మృతుల సంఖ్య 675గా తేలగా.. టిబెట్‌లో ఏడుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో మొత్తం మృతుల సంఖ్య 682కు చేరుకుంది. వరద దెబ్బతిన్న ప్రాంతాల్లో వర్షాలు పడేఅవకాశముందని నేపాల్ వాతావరణశాఖ శనివారం హెచ్చరించింది.

### వెతుకులాటలో వేల మంది..

11,000 మంది భద్రతా సిబ్బంది, 5,000 మంది నేపాల్ సైనిక సిబ్బంది సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నారు. భారత్ నుంచి 11 మంది వైద్య సిబ్బంది, టన్నెల్ నిపుణులు నేపాల్‌లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. వారు శనివారం త్రిశూలివద్ద జల విద్యుత్తు ప్రాజెక్టు టన్నెల్‌లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.
త్రిశూలి, రసువాల్లోని టన్నెళ్ల నుంచి ఇప్పటిదాకా 191 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. 1,706 మందికి వైద్య సాయం అందిస్తున్నారు.
విపత్తు సమయంలో భారత్ అందిస్తున్న సాయాన్ని నేపాల్ ప్రశంసించింది. ప్రధాని మోదీ ఎంతో ఉదారంగా వ్యవహరిస్తున్నారని కొనియాడింది.
రసువా జల విద్యుత్తు ప్రాజెక్టు నుంచి నలుగురు భారతీయులను శనివారం బయటకు తీసుకొచ్చారు.
నేపాల్‌లో వరద ప్రభావిత ప్రాంతం దేవీఘాట్ గ్రామంలో తమ ఇళ్ల నుంచి వస్తువులను తీసుకెళ్తున్న స్థానికులు

### మరో మార్గం ద్వారా..

టిబెట్‌లో చిక్కుకున్న 120 మంది భారతీయులను మరో మార్గంద్వారా శనివారం నేపాల్‌కు తరలించారు. మానసరోవర్ యాత్రికులకు గైరాంగ్‌నేపాల్ సరిహద్దు ప్రధాన మార్గంగా ఉండేది. వరదలకు అది ధ్వంసం కావడంతో ప్రస్తుతం జాంగ్ము మార్గం ద్వారా తరలించారు.
డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి శనివారం జాంగ్ము మార్గం ద్వారానే నేపాల్ చేరుకున్నారు. జాంగ్మువద్ద వందల బస్సులు, వాహనాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఆగస్టు 23న ఆయన 31 మందితో టిబెట్‌కు వెళ్లారు.
గైరాంగ్ నుంచి 1,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, వారిలో 555 మంది పర్యాటకులని చైనా అధికార మీడియా వెల్లడించింది.

భారీ సాయం
వరద సహాయక చర్యల కోసం.. నేపాల్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, వ్యక్తుల నుంచి భారీగా విరాళాలొస్తున్నాయి. 87ఏళ్ల రాజీ రాణా అనే దాత 10.98 మిలియన్ నేపాలీ రూపాయలను విరాళంగా అందజేశారు. ఓ ప్రైవేటు సంస్థ 150 మిలియన్లను, మరో సంస్థ 50 మిలియన్లను అందజేసింది.
ఇప్పటిదాకా ప్రధాని సహాయ నిధికి 2.295 బిలియన్ నేపాలీ రూపాయలు విరాళాలుగా వచ్చాయి.

### 97 ఏళ్ల బామ్మ సురక్షితం

కేర్ సెంటర్ నుంచి 97 ఏళ్ల గుణ మాయ బొహరాను నాలుగు గంటలు కష్టపడి సహాయక సిబ్బంది రక్షించారు. ఆసుపత్రిలో ఆమె కోలుకుంటున్నారు. కేర్ సెంటర్‌లో పేరుకుపోయిన బురద నుంచి ఆమెను బయటకు తీసుకొచ్చి ఎక్స్‌కావేటర్ టబ్‌లో తరలిస్తున్న దృశ్యాలు వైరలయ్యాయి. తరలించే సమయంలో ఆమె ఒంటినిండా బురదే ఉంది. ఆమె యోధురాలిలా బయటకు వచ్చారని ఆమె మనవడు దీపక్ బొహరా తెలిపారు. ఆమె కోసం అతడు కాఠ్‌మాండూ నుంచి ఘటనా స్థలికి వెళ్లారు. అయితే మిగిలినవారు చనిపోవడం తనను కలచివేసిందని దీపక్ తెలిపారు

# 'సర్' లోపభూయిష్టం



ఈకబురు, హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్)- 2026 ప్రక్రియ లోపభూయిష్టంగా తయారైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. గత జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లుండగా, 73.39 లక్షల (21.7%) మంది ఓటర్లను ఆచూకీ లేని/గైర్హాజరీలో ఉన్న/మరణించిన/డూప్లికేట్ (ఏఎస్‌డీడీ) ఓటర్లుగా గుర్తించడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వీరిలో 45.19 లక్షల (62%) మంది ఓటర్లను ఏ ప్రాతిపదికన శాశ్వతంగా గైర్హాజరీ(వలస)లో ఉన్న ఓటర్లుగా వర్గీకరించారని ప్రశ్నించారు. 2.65 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేయగా, 60.50లక్షల మంది ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు, 32.36లక్షల మంది అన్‌మ్యాప్డ్ ఓటర్లున్నట్టు నిర్ధారించినట్టు గుర్తు చేశారు. ఈ రెండు కేటగిరీలు కలిపి మొత్తం 92.86లక్షల మంది ఓటర్లకు నోటీసులు ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లు తమ ఓటు హక్కును నిలబెట్టుకోవడానికి మళ్లీ ఆధారాలు చూపించుకోవాల్సిన పరిస్థితి లేదా ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు శనివారం ఆయన లేఖ రాశారు.

సీఎం ఎత్తిచూపిన లోపాలు..
తాత్కాలిక, శాశ్వత వలసల మధ్య తేడా చూపలేదు. బీఎల్ఓ వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఇంట్లో లేని ఓటర్లనూ శాశ్వతంగా వల స వెళ్లిన వారిగానే పరిగణించారు.
ఇల్లు మారిన ఓటర్లకు కొత్త చిరునామాలో ఓటు నమోదు చేసుకోవడానికి (ఫారం-6) ఎలాంటి సహాయం అందించడం లేదు, కానీ పాత ప్రదేశంలో వారి ఓటును తొలగిస్తున్నారు.
చట్టబద్ధమైన నోటీసు మెకానిజమ్ లేదు. వలస వెళ్లిన కేటగిరీ కింద ఓట్లను తొలగించే ముందు ఓటర్లకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వడం లేదు. వ్యత్యాసాలు కలిగిన, లింక్ కాని ఓటర్లకు మాత్రమే నోటీసులు ఇస్తున్నారు. మళ్లీ ఎన్నికలు జరిగినప్పుడు ఓటేయడానికి పోతేనే తమ ఓటు పోయిందనే నిజం ఓటరుకు తెలుస్తుంది.
రాష్ట్రంలోని మూడో వంతు ఓటర్లు హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉండగా, 58.6% ఏఎస్డీడీ ఓటర్లు, 41.9% నోటీసులు అందుకునే ఓటర్లు ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నారు. కొద్ది వందల మీటర్ల దూరంలో ఇల్లు మారినా పోలింగ్ స్టేషన్ మారుతుందని, వివాహం లేదా ఉద్యోగం కారణంగా ఇల్లు మారడం సాధారణమని, దానిని ఓటు హక్కు రద్దుకు కారణం చేయకూడదు.

పూర్తిగా సహకరిస్తాం...
అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కు కోల్పోకూడదు, అర్హత లేని ఏ ఒక్కరూ జాబితాలో ఉండకూడదు అనేదే సర్ ప్రక్రియ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హెల్ప్‌డెస్క్‌ల నిర్వహణ, గ్రామసభలు, వార్డు సమావేశాల ఏర్పాటు, ప్రచారం, అవగాహన కార్యక్రమాలు, లాజిస్టికల్ మద్దతుతో సహా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎన్నికల సంఘానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

సీఈసీకి రేవంత్ చేసిన ప్రతిపాదనలివీ..
1. అభ్యంతరాలు, దరఖాస్తుల గడువు పొడిగించాలి. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలతోపాటు కొత్త ఓటర్ల నమోదు, వివరాల దిద్దుబాటుకు దరఖాస్తుల గడువు సెప్టెంబర్ 16 వరకు నెల రోజులు మాత్రమే ఇచ్చారు. సగం గడువు ముగిసింది. తుది జాబితా అక్టోబర్ 19న విడుదల కానుంది. ఓటర్లు తమ పేర్లు చెక్ చేసుకుని ఫారం-6 సమర్పించడానికి మరో 4 వారాల పాటు గడువును పొడిగించాలి. సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవు కాబట్టి ఈ సవరణ సులభమే.
2. ఈసీఐ మాన్యువల్ ప్రకారం ఓటర్ల ముసాయిదా జాబితాను గ్రామసభల్లో, నగరాల్లో వార్డు కమిటీ సమావేశాల్లో కనీసం రెండుసార్లు బిగ్గరగా చదివి వినిపించేలా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించాలి.
3. నోటీసులకు జవాబు ఇవ్వడానికి ఇస్తున్న వారం వ్యవధి సరిపోదు. ముఖ్యంగా కూలీలు, వలస కార్మికులు, వృద్ధులకు వేరే ప్రాంతాల నుంచి ధ్రువపత్రాలు తెచ్చుకోవడానికి 3 నుంచి 4 వారాల వ్యవధి ఇవ్వాలి.
4. పట్టణ ప్రాంతాల్లో, బూత్ స్థాయిలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి ఓటర్లకు అవసరమైన సర్టిఫికెట్లు పొందడంలో, అధికారుల నుంచి డాక్యుమెంట్లు సమర్పించడంలో నేరుగా సహాయం అందించాలి.
5. 2026 జూలై 25న జారీ చేసిన జీవో 172 కింద ఇచ్చిన ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను ఈసీ తిరస్కరించడంతో పట్టణ ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి మండల స్థాయిలో త్వరగా లభించే పత్రాలను అనుమతిస్తూ స్పష్టమైన జాబితాను ప్రకటించాలి.
6. హైదరాబాద్‌లోని ఒక్కో నియోజకవర్గంలో 78వేలకు పైగా ఓటర్లకు నోటీసులు ఇస్తున్నారు. అధికారుల ముందు ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా హాజరుకావడం అసాధ్యం. కాబట్టి అదనపు ఈఆర్‌వోలను నియమించి, ఈఆర్‌వో స్థాయి కంటే కిందనే వికేంద్రీకృత పద్ధతిలో సమయం కేటాయించి విచారణ జరపాలి.

# చిన్న నీటిపారుదల వ్యవస్థపై కీలక నివేదిక



హైదరాబాద్, ఆగస్టు 29 (ఈకబురు, ):

రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను బలోపేతం చేసి నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే దిశగా తెలంగాణ వ్యవసాయ-రైతు సంక్షేమ కమిషన్ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి శనివారం అందజేశారు. కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిసి నివేదిక సమర్పించింది. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధి, నీటి భద్రత, గ్రామీణ జీవనోపాధుల మెరుగుదలకు చిన్న నీటిపారుదల వ్యవస్థ పునరుద్ధరణ అత్యంత అవసరమని నివేదికలో పేర్కొన్నారు. కమిషన్ ప్రతినిధి బృందంలో సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గంగాధర్, భవానిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కమిషన్ చేసిన సిఫారసులపై ముఖ్యమంత్రి వారితో విస్తృతంగా చర్చించారు. వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాలను ప్రోత్సహించడంతో పాటు ఉద్యానవన పంటల సాగును పెంచే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీవోలు) ఏర్పాటుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.
చిన్న నీటిపారుదల వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కమిషన్ తన నివేదికలో సూచించింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను అనుసంధానించి నీటి వినియోగాన్ని సమగ్రంగా నిర్వహించే విధానాలను అమలు చేయాలని పేర్కొంది. ఈ చర్యల ద్వారా సాగునీటి వినియోగం మెరుగుపడి వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని అభిప్రాయపడింది. రాష్ట్రంలోని చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలని కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) సరిహద్దులను తక్షణం గుర్తించి, ఆక్రమణలను తొలగించి వాటిని సంరక్షించాలని సూచించింది. చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని నివేదికలో వివరించింది.
తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువులు కీలక పాత్ర పోషిస్తున్నాయని కమిషన్ పేర్కొంది. చెరువుల ఆధారిత వ్యవసాయాన్ని బలోపేతం చేయడం ద్వారా రైతుల ఆదాయం పెరగడమే కాకుండా వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా కొంతవరకు తగ్గించవచ్చని అభిప్రాయపడింది. నీటి వనరుల సంరక్షణను దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహంలో భాగంగా చూడాలని సూచించింది. గత రెండేళ్లలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సిఫారసులను ప్రతినిధి బృందం ముఖ్యమంత్రికి వివరించింది. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి కమిషన్ అందిస్తున్న సూచనలను సీఎం అభినందించారు. కమిషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, రైతుల ప్రయోజనాల దృష్ట్యా మరిన్ని ఆచరణాత్మక సూచనలు అందించాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం, కమిషన్ సమన్వయంతో ముందుకు సాగనున్నట్లు సమావేశంలో వెల్లడైంది.

# సాంకేతికత, ఆవిష్కరణలే పోలీసింగ్‌కు దిక్సూచి

ఈకబురు, హైదరాబాద్, ఆగస్టు 29:
నేరాల స్వరూపం వేగంగా మారుతున్న నేపథ్యంలో కృత్రిమ మేధ (ఏఐ), ఆధునిక సాంకేతికతను పోలీసింగ్‌లో విస్తృతంగా వినియోగించాలని డిజిపి సి. వి. ఆనంద్ సూచించారు. తెలంగాణ పోలీసింగ్ దేశంలోనే ముందంజలో ఉండాలంటే క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్), ఇంటర్‌ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసీజేఎస్)లను నిరంతరం అప్‌డేట్ చేస్తూ సమర్థంగా అమలు చేయాలని తెలిపారు. శనివారం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో అన్ని విభాగాల పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



**డిజిటల్ వ్యవస్థలపై నిరంతర పర్యవేక్షణ**

పోలీసు శాఖలో అందుబాటులో ఉన్న సాంకేతికత ఆధారిత అప్లికేషన్లను మరింత విస్తృతంగా వినియోగించాలని డిజిపి సూచించారు. డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సమాచారాన్ని అప్‌డేట్ చేయాలన్నారు. కొత్త నేర చట్టాల (ఎన్‌సీఎల్) అమలు, ఈసాక్ష్య, ఈఫోరెన్సిక్, ఐసీజేఎస్ అనుసంధానం, జాతీయ స్థాయి పోర్టళ్లలో తెలంగాణ పనితీరుపై సమీక్షించారు. మెరుగుపరచాల్సిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

**కోర్టు కేసులపై ప్రత్యేక శ్రద్ధ**

కోర్టు కేసుల నిర్వహణకు పోలీసులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిజిపి సూచించారు. న్యాయ ప్రక్రియలను కచ్చితంగా పాటిస్తూ కేసుల పురోగతిని సమర్థంగా పర్యవేక్షించాలన్నారు. దర్యాప్తు, కోర్టు విధానాలు, న్యాయపరమైన అంశాలపై పోలీసులకు నిరంతరం శిక్షణ ఇవ్వాలని చెప్పారు.
జిల్లా శిక్షణ కేంద్రాలు, నగర శిక్షణ కేంద్రాలు, పోలీసు శిక్షణ కళాశాలలు, బెటాలియన్లు, పోలీసు అకాడమీలు నిర్వహించే శిక్షణ కార్యక్రమాలు మారుతున్న నేర పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని సూచించారు. నిరంతర శిక్షణతో సిబ్బంది నైపుణ్యాలు, విశ్లేషణ సామర్థ్యం పెరిగి విధుల నిర్వహణ మరింత సమర్థంగా సాగుతుందని పేర్కొన్నారు.

**ప్రమాణాల అమలులో ప్రతిభ ...**
**అభినందించిన డిజిపి**

రాష్ట్ర స్థాయిలో నేర నియంత్రణకు సంబంధించిన వివిధ ప్రమాణాల అమలులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు విభాగాలను ఆనంద్ అభినందించారు. క్లస్టర్ 1లో హైదరాబాద్, క్లస్టర్ 2లో రామగుండం, క్లస్టర్ 3లో నల్గొండ, క్లస్టర్ 4లో సూర్యాపేట ప్రథమ స్థానాల్లో నిలిచాయి. ఆయా విభాగాల అధికారులను డిజిపి సర్టిఫికెట్లతో సత్కరించారు.

**యువ ఐపీఎస్‌లకు ప్రశంసలు**

ఏఐ ఆధారిత అప్లికేషన్లను రూపొందించి పోలీసు శాఖలో అంతర్గత సామర్థ్యం, పర్యవేక్షణను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్న యువ ఐపీఎస్ అధికారులను డిజిపి అభినందించారు. ఆధునిక సాంకేతికతను పోలీసింగ్‌తో అనుసంధానిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా మరిన్ని వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు.
2013 బ్యాచ్, ఆపై బ్యాచ్‌లకు చెందిన ఐపీఎస్ అధికారులతో నిర్వహించిన నాయకత్వ లక్షణాలు అంశాలపై డిజిపి కీలక ఉపన్యాసం చేశారు. నాయకత్వంలో ముందుండి నడిపించడం, నిజాయితీ, బృంద స్ఫూర్తి వంటి అంశాల ప్రాధాన్యాన్ని వివరించారు.

**సమన్వయంతో నేరాల కట్టడి**

మారుతున్న నేర ధోరణులను ఎదుర్కొనేందుకు అన్ని పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని డిజిపి ఆదేశించారు. పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగం, డేటా ఆధారిత నేర విశ్లేషణ, వృత్తిపరమైన శిక్షణ, సిబ్బంది హేతుబద్ధమైన వినియోగం కలగలిపితే తెలంగాణ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా, ప్రజలకు స్పందించేలా తీర్చిదిద్దవచ్చని తెలిపారు.
సమావేశంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, జైళ్ల డీజీ సౌమ్య మిశ్రా, ఆర్‌బీవీఆర్ఆర్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, మహిళా భద్రత విభాగం డీజీ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యతో పాటు పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేడే నీట్ పీజీ పరీక్ష




ఈకబురు,): హైదరాబాద్: వైద్య విద్యలో పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్ పీజీ-2026) నేడు (ఆదివారం) జరగనుంది. దేశవ్యాప్తంగా 2,73,183 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. 340 నగరాల్లోని సుమారు 1,300 పరీక్షా కేంద్రాల్లో ఒకే విడతలో కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష నిర్వహించేందుకు జాతీయ వైద్య పరీక్షల మండలి (ఎన్‌బీఈఎంఎస్) ఏర్పాట్లు చేసింది. గతేడాదితో పోలిస్తే ఈసారి అభ్యర్థుల సంఖ్య 12.5 శాతానికిపైగా పెరిగింది. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు ముగియనుంది. అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియ ఉదయం నుంచే ప్రారంభమవుతుంది.
ఎలాంటి చివరి నిమిషం ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించేందుకు అడ్మిట్ కార్డుతో పాటు చెల్లుబాటయ్యే ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలి. రాష్ట్రంలో నీట్ పీజీ పరీక్షకు 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 17,600 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. అభ్యర్థుల ప్రవేశానికి ఉదయం 7 గంటల నుంచే అనుమతించనున్నారు. ఈ ఏడాది నీట్ పీజీ పరీక్ష విధానంలో మార్పులు చేశారు. మొత్తం 180 ప్రశ్నలకు 210 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. గతంతో పోలిస్తే ఒక్కో ప్రశ్నకు ఎక్కువ సమయం లభించేలా పరీక్ష వ్యవధి, ప్రశ్నల సంఖ్యను పునర్వ్యవస్థీకరించారు.
పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా, బయోమెట్రిక్ ధ్రువీకరణ, తనిఖీలు, సిగ్నల్ జామర్లు, ప్రత్యక్ష పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టారు. దేశవ్యాప్తంగా 60 వేల మందికిపైగా పరీక్ష సిబ్బందిని విధుల్లో నియమించారు. నీట్ పీజీ పరీక్షకు సంబంధించి సోషల్ మీడియాలో ప్రశ్నపత్రం లీక్, పరీక్ష వాయిదా వంటి వదంతులు ప్రచారంలోకి వచ్చిన నేపథ్యంలో అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్షపై ఎలాంటి అధికారిక సమాచారం అయినా ఎన్‌బీఈఎంఎస్ వెబ్‌సైట్‌లోనే వెల్లడిస్తామని అధికారులు స్పష్టం చేశారు. పరీక్ష నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే ఆదివారం నిర్వహించనున్నారు.

# మారిషస్‌లో తెలుగు సంస్కృతి ప్రోత్సాహానికి సహకారం

హైదరాబాద్, ఆగస్టు 29 ఈకబురు, ):
మారిషస్‌లో తెలుగు భాష, సంస్కృతి, పురాణ ఇతిహాసాల ప్రచారం, పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల మంత్రి లచ్మునారాజ్ పెంటియా నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ-మారిషస్ మధ్య సుదీర్ఘకాలంగా సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ప్రజల మధ్య ఉన్న స్నేహపూర్వక బంధాలు ఇరు ప్రాంతాలను మరింత దగ్గర చేశాయని అన్నారు. ముఖ్యంగా తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల ద్వారా తెలంగాణకు మారిషస్‌తో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని వివరించారు.
మారిషస్‌లో నివసిస్తున్న తెలుగు సమాజం అక్కడి బహుళ సాంస్కృతిక సమాజంలో కీలక పాత్ర పోషిస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలుగు భాష, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు అక్కడి తెలుగు సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలతో సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. మారిషస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న రామ భజనం కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్య, సాంస్కృతిక పరిశోధన, కళలు, భాషాభివృద్ధి, వారసత్వ పరిరక్షణ వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా మారిషస్ మంత్రి లచ్మునారాజ్ పెంటియా మాట్లాడుతూ మారిషస్‌లోని తెలుగు కల్చరల్ సెంటర్ ద్వారా లక్షలాది మంది తెలుగు ప్రవాసులు తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుంటున్నారని చెప్పారు. తెలుగు వారసత్వాన్ని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారం తమకు ఎంతో



ప్రోత్సాహాన్నిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాష, సంస్కృతిని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మారిషస్ ప్రతినిధి బృందం ప్రశంసించింది. తెలుగు ప్రవాసుల అభ్యున్నతి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది. ఈ భేటీతో తెలంగాణ-మారిషస్ మధ్య సాంస్కృతిక, విద్యా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఇరు పక్షాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# బొగ్గు మసిలో విరిసిన నవ్వు...

ఈకబురు,హైదరాబాద్ :
రహదారి పక్కన నిలిచిన లారీ... చేతిలో ఆవిర్లు కక్కే ఒక చిన్న పేపర్ టీ కప్పు... ముఖమంతా వికసిస్తూ పెల్లుబికిన ఒక కల్మషం లేని నవ్వు. నేడు సామాజిక మాధ్యమాల్లో కోట్ల మందిని నవ్విస్తున్న ఒక వైరల్ మీమ్ అది. కానీ, క్షణికావేశాల రీల్స్ విపణి చూడలేని ఒక అసలుసిసలైన జీవన సంగ్రామం ఆ నవ్వు వెనుక దాగి ఉంది.
ఆ కుర్రాడి పేరు అరుణ్ కుమార్. తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహాముత్తారం మండలం, కర్లకుంట గ్రామానికి చెందిన ఒక సామాన్య శ్రామిక బిడ్డ. కుటుంబ కటిక పేదరికం పదేళ్ల పసిప్రాయంలోనే పలకా బలపాన్ని లాగేసుకుని, నాలుగో తరగతితోనే బడికి దూరం చేసింది. బొగ్గు గనుల దుమ్ము, లారీ చక్రాల కింద క్లీనర్‌గా కాయకష్టం అతడికి నిత్య జీవితంగా మారాయి.
అదే బొగ్గు లోడింగ్ పాయింట్ వద్ద రోజంతా చెమటోడ్చి, స్నానం చేసి కొత్త చొక్కా తొడుక్కున్న వేళ... టీ తాగుతూ లారీ డ్రైవర్ నెహ్రూ వేసిన ఒక చిన్న జోక్‌కు అరుణ్ పొట్ట చెక్కలయ్యేలా నవ్వాడు. కొత్త బట్టలు ఎక్కడ పాడవుతాయోనన్న అమాయకపు భయంతో టీ కప్పును కాస్త దూరంగా జరుపుతూ అతడు నవ్విన ఆ నవ్వులో పేదరికం గీసిన గీతలు లేవు, రేపటి గురించిన దిగులూ లేదు; నిష్కల్మషమైన అమాయకత్వం మాత్రమే ఉంది. ఆ కొన్ని క్షణాలను నెహ్రూ తన ఫోన్ కెమెరాలో బంధించి సరదాగా సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. అది కోట్ల మంది హృదయాలను తాకిన వైరల్ దృశ్యంగా మారింది. నేడు ఇంటర్నెట్ ప్రపంచంలో ఎవరు కామెడీ రీల్ చేసినా, కితకితలు పెట్టే ఒక యూనివర్సల్ రియాక్షన్ మీమ్‌గా ఆ ముఖం స్థిరపడిపోయింది.
అయితే, ఈ కథ అక్కడితో ముగిసిపోలేదు. కోట్ల మంది రీల్స్ చేసుకుంటూ ఆ నవ్వుతో కాలక్షేపం చేస్తుంటే, ఆ వీడియో కింద వచ్చిన వేలాది కామెంట్లను కూడా చదవలేని అరుణ్ నిరక్షరాస్యతను చూసి లారీ డ్రైవర్ నెహ్రూ మనసు కదిలిపోయింది. తనూ పేదరికం వల్ల చదువు ఆపేయాల్సి వచ్చిన బాధను ఎరిగిన నెహ్రూ, అరుణ్ జీవితం లారీ చక్రాల కిందే ముగిసిపోకూడదని సంకల్పించాడు. ప్రయాణాల బడలిక నడుమ లారీ క్యాబిన్నే తరగతి గదిగా మార్చాడు. హైవేల పక్కన లారీ హెడ్‌లైట్ల వెలుతురులో అక్షరాలు నేర్పించాడు, పుస్తకాలు కొనిచ్చాడు, ఫీజులు చెల్లించి ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పరీక్షలు రాయింపజేశాడు. అరుణ్ పదో తరగతి గడప దాటి తన జీవితంలో అసలైన గెలుపును అందుకున్నాడు.
డిజిటల్ విపణి ఆ నవ్వును వాడుకుని కోట్ల వ్యూస్ ఆర్జించుకుంది కానీ, అతనికి ఏ రాయల్టీనీ ఇవ్వలేదు. అయితేనేం... ఈ వర్చువల్ ప్రపంచపు కృత్రిమ లెక్కలతో సంబంధం లేకుండా, లారీ క్యాబిన్ నుంచి మొదలైన ఆ అక్షర ప్రయాణం అరుణ్ ఆత్మవిశ్వాసాన్ని నిలబెట్టింది. గురువుగా మారిన ఒక లారీ డ్రైవర్ హృదయ సంస్కారానికి, పట్టుదలతో నిలబడ్డ ఒక శ్రామిక బాలుడి సంకల్పానికి ఇది నిలువెత్తు నిదర్శనం.
పేదరికం, కష్టాలు ఎన్ని చీకట్లను సృష్టించినా... సంకల్పం, మంచి మనుషుల తోడు ఉంటే ఆత్మవిశ్వాసం చిగురిస్తుందనడానికి అరుణ్ జీవన ప్రయాణమే ఒక తిరుగులేని స్ఫూర్తి. ఆనాడు బొగ్గు మసిని దాటుకుని రోడ్డు పక్కన వికసించిన ఆ స్వచ్ఛమైన నవ్వు, రేపటి విజయాల వైపు సాగుతూ నవ సమాజానికి వెలుగులు పంచుతూ ఎప్పటికీ అలాగే పదిలంగా వెలగాలి.
జీవితంలో ఎప్పుడైనా అరుణ్ ఎదురైతే గట్టిగా హత్తుకోవాలనే మాబోటి వారి ఆకాంక్ష వెనుక..ఈ సమాజానికి నిస్వార్థంగా నవ్వును, శ్రమను, సమయాన్ని ధారపోసే అసంఖ్యాక శ్రామికుల పట్ల ఉండే ప్రగాఢమైన గౌరవం ఉంది. లోకం ఆ శ్రమకు తగిన విలువ కట్టకపోయినా, మానవత్వపు విలువ ఎప్పటికీ నిత్య నూతనంగా వర్ధిల్లుతూనే ఉంటుంది.



నోట్ : సోషల్ మీడియా లో వైరల్ అవుతున్న ఈ వార్త ను యధాతదంగా ప్రచురించడం జరిగింది.

# ఖర్గే సభావేదికను "శుద్ధీకరించిన" వారిపై ఎస్సీఎస్టీ కేసు నమోదుచేయాలి

ఈకబురు, దిల్లీ: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఈనెల 8న కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న ఒక సభావేదికను "శుద్ధీకరించిన" ఘటనకు సంబంధించి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ భాజపాఆర్ఎస్ఎస్‌లను తీవ్రంగా విమర్శించారు. ఖర్గే బహిరంగసభ వేదికను శుద్ధి చేసి అంటరానితనాన్ని ప్రోత్సహించిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఖర్గే పాల్గొన్న బహిరంగసభ వేదికను శుద్ధిచేయడం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఉల్లంఘించడమే. ఇంతటి నేరం. జరిగినా ప్రభుత్వం ఇంతవరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇప్పటికైనా వేదికను శుద్ధిచేసిన వారిపై చట్ట ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదుచేయాలి. ప్రధానమంత్రి మోదీ తాను దేశంలోని అన్ని వర్గాలవారికీ ప్రధానమంత్రినని చెప్పుకుంటున్నారు. కానీ ఉత్తరాఖండ్‌లో వారి పార్టీ అధ్యక్షుడు మహేంద్రభట్ మాత్రం "శుద్ధీకరణ"ను సమర్థిస్తున్నారు. అక్కడ వేదికను "శుద్ధి"చేసిన వారంతా ఆర్ఎస్ఎస్ వారే. అందువల్ల బాధ్యులందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదుచేసేలా ప్రధానమంత్రి ఉత్తర్వులు ఇవ్వాలి.
దేశంలో రెండు భావజాలాల మధ్య పోరాటం సాగుతోంది. ఈ పోరాటంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ, జవహర్లాల్ నెహ్రూలు రూపొందించిన భారత రాజ్యాంగం ఒకవైపు, భాజపాఆర్ఎస్ఎస్‌లు మరోవైపు ఉన్నాయి. వేల సంవత్సరాలుగా దళితులపై అత్యాచారాలు జరుగుతున్నాయి. ఈ దేశంలోని దళితులు ఎదగకూడదని, గౌరవంగా జీవించకూడదని భాజపా, ఆర్ఎస్ఎస్‌లు కోరుకుంటున్నాయి. పైకి చెప్పేది ఏదైనా వారి వాస్తవ మనస్తత్వం మాత్రం ఇదే. అందువల్ల వెంటనే ఉత్తరాఖండ్ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాల్సిందే. కాంగ్రెస్ అధ్యక్షుడికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయమని డిమాండ్ చేస్తున్నాం" అని రాహుల్ పేర్కొన్నారు. న్యాయం జరుగుతుందని మీరు నమ్ముతున్నారా? అన్న ప్రశ్నకు బదులిస్తూ "ఈ ఘటనకు బాధ్యులైనవారు ఎవ్వరూ తప్పించుకోలేరు. ఈరోజు కాకపోయినా రేపైనా ఖర్గేకి న్యాయం జరుగుతుందని మేం నమ్ముతున్నాం. మా డిమాండ్ ఫలించి కచ్చితంగా ఎఫ్ఐఆర్ నమోదుచేస్తారు" అని ధీమా వ్యక్తం చేశారు. ఇది కేవలం ఖర్గేకు సంబంధించిన అంశంకాదని, ఈ దేశంలో ప్రతి దళితునికి సంబంధించిన విషయమని అన్నారు.



ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడికి వ్యతిరేకంగా ఇలాంటి దురాగతానికి పాల్పడ్డారంటే పాఠశాలల్లో దళిత బాలబాలికల విషయంలో ఎలా ప్రవర్తిస్తుంటారో ఊహించుకోవచ్చు అని అన్నారు. ఇది భాజపా ఆలోచనా విధానానికి అద్దంపడుతోందని, అందుకే దానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని కాంగ్రెస్ నేత తెలిపారు. అంటరానితనం నేరం అని రాజ్యాంగం చెబుతోందని, వేదికను శుద్ధీకరించడం అన్నది అంటరానితనాన్ని ప్రోత్సహించడం కిందికే వస్తుందన్నారు. ఈ పనిని సమర్థించిన భాజపా ఉత్తరాఖండ్ అధ్యక్షుడు మహేంద్రభట్‌ను కాంగ్రెస్ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇప్పుడు బంతి భాజపా కోర్టులో ఉంది. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటే సరేసరి లేదంటే మేం స్పందించాల్సి ఉంటుంది అన్నారు. వారి చర్యలన్నిటిపై తమ నుంచి అంతకంటే పెద్ద ప్రతిచర్య ఉంటుందని హెచ్చరించారు.

## అందుకే శుభ్రం చేశాం: భాజపా

అయితే రాహుల్ గాంధీ వ్యాఖ్యలను భాజపా ఖండించింది. కేవలం తన రాజకీయ ప్రయోజనాల కోసం సమాజాన్ని విభజించేలా రాహుల్ ఈ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఖర్గే కార్యక్రమం పూర్తి చేసుకున్న తర్వాత వేదిక అపరిశుభ్రంగా ఉన్న కారణంగానే అక్కడ పూజ నిర్వహించామని, పక్కనే ఒక ఆలయం కూడా ఉందని దిల్లీలోని తమ ప్రధాన కార్యాలయంలో భాజపా అధికార ప్రతినిధులు సుధాన్షూ త్రివేది, గురు ప్రకాశ్ పశ్వాన్‌లు చెప్పారు.
కాంగ్రెస్ అబద్ధాలు చెప్తోంది: రాహుల్ వ్యాఖ్యలపై భాజపా స్పందించింది. దళితులకు మోదీ ప్రభుత్వం అత్యున్నత గౌరవాన్ని ఇచ్చిందని నొక్కిచెప్తూ.. కాంగ్రెస్ అబద్ధాలు చెప్తోందని విమర్శించింది. "కాంగ్రెస్, ఖర్గేలు అబద్ధాలు చెప్పటంలో దిట్టలు" అని భాజపా ఎంపీ రవి శంకర్ ఆరోపించారు.

# సీబీజీ ధరల సవరణపై కేంద్రం వివరణ




న్యూఢిల్లీ, ఆగస్టు 29 (ఈకబురు, ):
గోబర్ధన్ పథకం కింద కంప్రెస్డ్ బయోగ్యాస్ ధరలను సవరించిన నేపథ్యంలో సిఎన్‌జీ, పీఎన్‌జీ వినియోగదారులపై భారీ భారం పడుతుందన్న వార్తా కథనాలపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. సవరించిన ధరల విధానం ఉత్పత్తిదారులకు మద్దతు అందించడంతో పాటు వినియోగదారుల ప్రయోజనాలను కూడా కాపాడేలా రూపొందించామని తెలిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం సీబీజీ ఉత్పత్తిదారులకు చెల్లించే ధర, సిఎన్‌జీ రిటైల్ ధరలో 85 శాతం ఆధారంగా నిర్ణయించబడుతోంది. తాజా లెక్కల ప్రకారం ఇది ఎంఎంబీటీయూకు సుమారు ₹1,478గా ఉంది. గోబర్ధన్ పథకం కింద ఈ ధరను ఎంఎంబీటీయూకు ₹2,110గా నిర్ణయించడంతో సీబీజీ ఉత్పత్తిదారులకు సుమారు 43 శాతం ధరల పెరుగుదల లభిస్తోంది.
అయితే ఈ మొత్తం ధరను నేరుగా సిఎన్‌జీ లేదా గృహ పీఎన్‌జీ వినియోగదారుల నుంచి వసూలు చేయబోమని కేంద్రం స్పష్టం చేసింది. సీబీజీ ఉత్పత్తిదారులకు అందించే ధరలో భాగంగా ప్రభుత్వం కిలోకు ₹10 చొప్పున ఆర్థిక మద్దతు అందించనుంది. ఇది 95 శాతం మీథేన్ కలిగిన సీబీజీకి ఎంఎంబీటీయూకు సుమారు ₹215కు సమానమని వివరించింది. ప్రభుత్వ మద్దతు మొత్తాన్ని మినహాయించిన తర్వాత వినియోగదారులపై పరోక్షంగా పడే సీబీజీ వ్యయం ఎంఎంబీటీయూకు సుమారు ₹1,895గా ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న ₹1,478తో పోలిస్తే ఇది దాదాపు 28 శాతం పెరుగుదల మాత్రమేనని, మీడియాలో ప్రచారమవుతున్నట్లుగా పూర్తి ధర పెరుగుదల వినియోగదారులపై మోపబడదని తెలిపింది.
సీబీజీ ఉత్పత్తి రంగం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి స్థిరమైన ధరలు అవసరమని కేంద్రం అభిప్రాయపడింది. రైతులు, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలు, బయోగ్యాస్ ప్లాంట్లకు ప్రోత్సాహం అందించేందుకు ఈ ధరల సవరణ కీలకమని పేర్కొంది. దీంతో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుందని తెలిపింది. సవరించిన ధరల విధానం ద్వారా ఒకవైపు సీబీజీ ఉత్పత్తిదారులకు స్థిరమైన ఆదాయం లభిస్తుండగా, మరోవైపు ప్రభుత్వ ఆర్థిక మద్దతు, విస్తృత గ్యాస్ పంపిణీ వ్యవస్థ ద్వారా వినియోగదారులపై గణనీయమైన ధరల భారం పడకుండా చర్యలు తీసుకున్నామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విధానం దేశంలో స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని మరింత ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంది.



# రవ్వంత బంగారంతో భారీ ఇల్లు కొన్న కియోసాకి!

ప్రముఖ రచయిత, పెట్టుబడులపై అవగాహన కల్పించే రాబర్ట్ కియోసాకి మరోసారి బంగారం ప్రాధాన్యంపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'రిచ్ డాడ్ పూర్ డాడ్' పుస్తకంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కియోసాకి.. తన ఫేస్‌బుక్ ఖాతాలో చేసిన ఓ పోస్టులో తాను బంగారంతో 4.5 మిలియన్ డాలర్ల (సుమారు రూ.40 కోట్లకు పైగా) విలువైన ఇంటిని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

ఇంటి ధర 4.5 మిలియన్ డాలర్లు కాగా, దాన్ని సొంతం చేసుకోవడం కోసం తాను వినియోగించిన బంగారాన్ని అప్పట్లో 4.5 లక్షల డాలర్ల కొన్నట్లు రాసుకొచ్చారు. అంటే తాను 4.5 లక్షల డాలర్లకే కొన్న బంగారంతో ఇప్పుడు 45 లక్షల డాలర్ల విలువైన ఇంటిని కొనుగోలు చేశానన్నది ఆయన భావన. బంగారం విలువ ఎంతలా పెరిగిందో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు.

ఇది ఎలాంటి ఫోర్‌క్లోజర్ లేదా ప్రత్యేక డీల్ కాదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా తాను బంగారు నాణేలను పొదుపు చేస్తూ వచ్చానని, వాటి విలువ పెరగడంతో చివరకు ఆ బంగారాన్ని ఇంటి కొనుగోలుకు ఉపయోగించానని పేర్కొన్నారు.

ప్రస్తుతం వెండి ఔన్సుకు 45 డాలర్లు, బంగారం ఔన్సుకు 3,500 డాలర్ల స్థాయిలో ఉన్నాయని కియోసాకి తన పోస్టులో పేర్కొన్నారు. అయితే తాను వెండిని ఔన్సుకు కేవలం ఒక డాలర్ ఉన్నప్పటి నుంచే కొనుగోలు చేసి పొదుపు చేయడం ప్రారంభించానని చెప్పారు. సంప్రదాయ కరెన్సీపై ఆధారపడటానికి బదులుగా బంగారం, వెండి వంటి విలువైన ఆస్తులను కూడబెట్టుకోవడంపై తనకు నమ్మకం ఉందన్నారు.

బ్యాంకులో డబ్బు దాచుకోవడం, కష్టపడి పని చేయడం వంటి సంప్రదాయ ఆర్థిక సలహాలపై కూడా కియోసాకి విమర్శలు చేశారు. ప్రభుత్వాలు పెద్ద మొత్తంలో కరెన్సీని ముద్రించడం వల్ల దాని విలువ క్రమంగా తగ్గుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. కాగితపు డబ్బు విలువను కోల్పోతున్న సమయంలో బంగారం, వెండి వంటి 'రియల్ మనీ', రియల్ అసెట్స్‌లో పొదుపు చేయడం ప్రయోజనకరమని పేర్కొన్నారు.

తాను ఏళ్లుగా బంగారాన్ని పొదుపు చేయడం వల్లే దాన్ని ఉపయోగించి భారీ విలువైన ఆస్తిని కొనుగోలు చేయగలిగానని కియోసాకి తెలిపారు. డాలర్లను పొదుపు చేయాలా, లేక బంగారం, వెండి వంటి విలువైన ఆస్తుల్లో పెట్టుబడి పెట్టాలా అనేది వ్యక్తిగత నిర్ణయమని తన పోస్టులో పేర్కొన్నారు.



# భారత్‌లో చాట్‌జీపీటీలో ప్రకటనలు

కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో సరికొత్త విప్లవం సృష్టించిన ఓపెన్ ఏఐ భారతదేశంలో తన రాబడి మార్గాలను విస్తరించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని చాట్‌జీపీటీ ఫ్రీ, నెలకు రూ.399 చెల్లించే 'గో' ప్లాన్ వినియోగదారులకు సంభాషణల్లో స్పాన్సర్డ్ ప్రకటనలు (యాడ్స్) చూపించడం ప్రారంభించినట్లు సంస్థ అధికారికంగా వెల్లడించింది. అయితే, ప్లస్, ప్రో, బిజినెస్, ఎంటర్‌ప్రైజ్, ఎడ్యుకేషన్ వంటి పెయిడ్ చందాదారులకు ఎటువంటి యాడ్స్ ఉండవని స్పష్టం చేసింది.

**వినియోగదారుల డేటా భద్రత**

ప్రకటనల వల్ల వినియోగదారుల అనుభవానికి భంగం కలగకుండా ఓపెన్ ఏఐ కఠినమైన నిబంధనలు విధిస్తున్నట్లు చెప్పింది. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం.. వినియోగదారులు అడిగే ప్రశ్నలకు ఏఐ ఇచ్చే సమాధానాలపై ఈ ప్రకటనలు ఎలాంటి ప్రభావం చూపవు. ప్రతి సమాధానం కింద 'స్పాన్సర్డ్' అని స్పష్టమైన లేబుల్‌తో యాడ్స్ ప్రత్యేకంగా కనిపిస్తాయి. ప్రకటనకర్తలకు వినియోగదారుల చాట్ హిస్టరీ, వ్యక్తిగత వివరాలు లేదా 'మెమరీస్' పొందే అవకాశం ఉండదు. కేవలం ఇంప్రెషన్లు, క్లిక్‌ల వంటి విశ్లేషణల సమాచారం మాత్రమే పొందుపరుస్తారు.

**నియంత్రణలు**

18 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారికి ప్రకటనలు కనిపించవు. అలాగే ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, రాజకీయం వంటి సున్నితమైన అంశాల చర్చల సమయంలో ప్రకటనలు ప్రదర్శించబడవు. సుమారు 330 మిలియన్ల నెలవారీ క్రియాశీల వినియోగదారులు ఉన్న ఇండియా ఓపెన్ ఏఐకి అతిపెద్ద మార్కెట్లలో ఒకటి. స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించేందుకు సెప్టెంబర్ 4 నుంచి 'చాట్‌జీపీటీ యాడ్స్ మేనేజర్' ద్వారా రోజుకు రూ.725 ప్రారంభ బడ్జెట్‌తో వ్యాపార ప్రకటనలు ఇచ్చుకునే వెసులుబాటును కల్పిస్తోంది. మొదటి దశలో డబ్ల్యూపీపీ, ఓమ్నికామ్ ఏజెన్సీలతో భాగస్వామ్యం కుదుర్చుకోగా మొదటి వారంలోనే 50కి పైగా ప్రముఖ బ్రాండ్లు ప్రకటనలు ఇవ్వడానికి సిద్ధమయ్యాయని కంపెనీ తెలిపింది.

# చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం లేదు

## ద్రవ్యోల్బణంపై రాజన్ హెచ్చరిక



ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పట్టిపీడిస్తున్న ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయకపోతే తీవ్ర పర్యవసానాలు తప్పవని, అమెరికా కేంద్రీయ బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ తక్షణమే కీలక వడ్డీ రేట్లను పెంచాలని భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ కుండబద్దలు కొట్టారు. ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా? అన్నట్లు, గ్లోబల్ మార్కెట్‌లో అమెరికా తీసుకునే నిర్ణయాలు ప్రపంచదేశాల ఆర్థిక గమనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఈ నేపథ్యంలో ఫెడ్ ముందస్తుగా వడ్డీ రేట్లను పెంచి ధరల మంటను అదుపులోకి తేకపోతే ముప్పు తప్పదని ఆయన హెచ్చరించారు.

అమెరికాలోని జాక్సన్ హోల్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక సెంట్రల్ బ్యాంకర్ల సదస్సులో ఓ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజన్ తన విశ్లేషణను పంచుకున్నారు. ఫెడ్ నిర్ణయాలను సమీక్షించే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లో సభ్యుడిగా ఉన్న ఆయన ఫెడ్ హాకిష్(వడ్డీ రేట్లు తగ్గింపు) ద్రవ్య విధానాన్ని అనుసరించాలని స్పష్టం చేశారు. పెరిగిన ద్రవ్యోల్బణం కారణంగా బాండ్ ఈల్డ్‌లు గత ఇరవై ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరాయి. దాంతోపాటు ఇవి మార్కెట్లలో అనిశ్చితిని పెంచుతున్నాయని పేర్కొన్నారు.

**పెరుగుతున్న ద్రవ్యోల్బణం**

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు కాకుండా పరిస్థితి చేజారక ముందే తగిన చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన నాయకత్వ లక్షణమని రాజన్ గుర్తుచేశారు. ఫెడ్ ప్రస్తుత విధానాల కంటే కఠినమైన వైఖరి అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. పెరుగుతున్న వినియోగదారుల ధరల సూచీకి అడ్డుకట్ట వేయడానికి ఫెడ్ రేట్ల పెంపు మార్గాన్నే ఎంచుకోవాలి. ఈ ఏడాది ఆఖరు నాటికి ఫెడ్ వడ్డీ రేట్లను పెంచవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ద్రవ్యోల్బణ నియంత్రణ పట్ల ఫెడ్ స్పష్టమైన కార్యాచరణను ప్రకటించకపోతే అంతర్జాతీయ మార్కెట్లలో ఊగిసలాట మరింత ఎక్కువవుతుందని కూడా నిపుణులు అంచనా వేస్తున్నారు.



# వెండికి ఫుల్ డిమాండ్.. అసలు కారణాలు ఇవే!

బంగారం ధరలు మాత్రమే కాకుండా.. వెండి ధరలు కూడా అమాంతం పెరుగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ధర ఔన్స్‌కు 69.71 డాలర్లకు చేరుకుంది. ఆగస్టు 26న ప్రారంభ ట్రేడింగ్‌లో ఈ స్థాయిని తాకింది. 2026 జూన్ 16 తర్వాత వెండి ధర ఇంత గరిష్ఠ స్థాయికి చేరడం ఇదే తొలిసారి.

అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరగడంతో.. దేశీయ మార్కెట్‌లో కూడా వెండి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. MCXలో సెప్టెంబర్ కాంట్రాక్ట్ వెండి ధర ఆగస్టు 25న 0.08 శాతం పెరిగి కిలోకు రూ.2,44,328కు చేరింది. ఈ నెలలో ఇప్పటివరకు వెండి ధర దాదాపు 20 శాతం పెరగడం గమనార్హం.

**వెండి ధర ఎందుకు పెరుగుతోంది?**

వెండి ధర పెరగడానికి చాలా కారణాలు ఉన్నాయి. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉందనే అంచనాలు, డాలర్ బలహీనపడటం, బంగారం ధరలు పెరగడం వంటి అంశాలు వెండికి మద్దతుగా నిలుస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ రుణాలు, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు కూడా సిల్వర్ రేటు పెరగడానికి ప్రధాన కారణం అవుతోంది. దీంతో పెట్టుబడిదారులు బంగారం, వెండి వంటి విలువైన లోహాల వైపు చూస్తున్నారు.

**బంగారం ధరల ప్రభావం**

వెండి ధరల పెరుగుదలలో బంగారం కూడా కీలక పాత్ర పోషిస్తోంది. బంగారం ధరలు పెరిగినప్పుడు చాలాసార్లు వెండిపై కూడా పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతుంది. ప్రస్తుతం బంగారం కూడా బలంగా ఉండటంతో వెండికి కూడా డిమాండ్ పెరిగింది. అందుకే వెండి ధరలు వేగంగా పైకి కదులుతున్నాయి.

**పారిశ్రామిక డిమాండ్**

బంగారంతో పోలిస్తే వెండికి మరో ప్రత్యేకత ఉంది. వెండిని కేవలం ఆభరణాలు, పెట్టుబడుల కోసమే కాకుండా అనేక పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. ముఖ్యంగా.. సోలార్ ప్యానెల్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఇతర టెక్నాలజీ రంగాల్లో వెండిని ఉపయోగిస్తున్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వెండికి పారిశ్రామిక డిమాండ్ కూడా పెరుగుతోంది. డిమాండుకు సరిపడా వెండి అందుబాటులో లేనప్పుడు ధరలు తప్పకుండా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే వెండిలో పెట్టుబడి పెట్టినవారు తమ పెట్టుబడులను కొనసాగించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే.. కొత్తగా పెట్టుబడి పెట్టాలనుకునేవారు మాత్రం కొంత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఎందుకంటే.. ఒక్క నెలలోనే వెండి ధర దాదాపు 20 శాతం పెరిగింది. ఇలాంటి సమయంలో ధరలు మరింత పెరుగుతాయని భావించి ఒకేసారి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టడం రిస్క్‌తో కూడుకున్నది. కొత్తగా పెట్టుబడి పెట్టేవారు మొత్తం డబ్బును ఒకేసారి పెట్టకుండా.. కొంత కొంతగా పెట్టుబడి పెట్టడం లేదా ధరలు కొద్దిగా తగ్గినప్పుడు కొనుగోలు చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

**భారతదేశంలో వెండి రేటు**

భారతదేశంలో కూడా వెండి రేటు పెరుగుదల దిశగా పరుగులు పెడుతున్నాయి. దీంతో హైదరాబాద్, విజయవాడలలో కేజీ వెండి రేటు రూ.2.60 లక్షల వద్ద, ఢిల్లీలో రూ.2.55 లక్షల వద్ద ఉంది. ధరల పెరుగుదల ఇలాగే కొనసాగితే వెండి రేటు రూ.3 లక్షలకు చేరుకుంటుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.



# 2047 నాటికి అందరికీ బీమా

**కెనడా నుంచి పెట్టుబడులపై భారత్ ఫోకస్**

**ఆర్థిక సంస్థలతో మంత్రి నిర్మలా సీతారామన్ భేటీ**

కెనడా ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులను ఆకర్షించే దిశగా పలు కెనడియన్ ఆర్థిక సంస్థలతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భేటీ అయ్యారు. భారత్‌లో పెట్టుబడులను మరింతగా పెంచాలని కోరారు. మంత్రితో సమావేశమైన సంస్థల్లో సన్ లైఫ్ ఫైనాన్షియల్, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (సీపీపీఐబీ) మొదలైనవి ఉన్నాయి. ఈ సందర్భంగా భారత్‌లో బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచడం, 2047 నాటికి అందరికీ బీమా కల్పించాలంటూ భారత్ లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం తదితర అంశాలను వివరించారు.

భారత్ పటిష్ట వృద్ధి, విస్తృత మార్కెట్, స్థూల ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉండటం, డిజిటల్..ఫిజికల్ మౌలిక సదుపాయాలు వేగంగా వృద్ధి చెందుతుండటం మొదలైనవి దీర్ఘకాలికంగా పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు కల్పించడంపై చర్చించినట్లు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఎక్స్‌లో ఆర్థిక శాఖ పోస్ట్ చేసింది. బీమా, అసెట్ మేనేజ్‌మెంట్, మౌలిక సదుపాయాలు మొదలైన విభాగాల్లో కార్యకలాపాలను విస్తరించేందుకు సన్ లైఫ్‌కి మరింతగా అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించినట్లు పేర్కొంది.

# ధరల మంటలు.. కుటుంబ బడ్జెట్ బేజారు

- **పేద, మధ్య తరగతి కుటుంబాల బెంబేలు.. కుటుంబ బడ్జెట్ బేజారు**
- **6.32 శాతం ద్రవ్యోల్బణంతో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానం**
- **దేశ సగటు ద్రవ్యోల్బణం 4.45 శాతం.. పెరిగిన ఉల్లి, కూరగాయలు, పప్పుల ధరలు**
- **రానున్న రోజుల్లో మరింత పెరిగే ముప్పు.. ధరల కట్టడికి సర్కారు చర్యలే కీలకం**



నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. కూరగాయలు, ఉల్లిగడ్డ, పప్పులు, ఇతరత్రా కిరాణా వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో మధ్యతరగతిపై భారం పెరుగుతోంది. దేశవ్యాప్తంగా ధరల పెరుగుదల కొనసాగుతున్నప్పటికీ... రాష్ట్రంలో అది మరికొంత అధికంగా ఉండటం ఆందోళనను కలిగిస్తోంది. ప్రధాన రాష్ట్రాల్లో దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రిటైల్ ద్రవ్యోల్బణం 6.32% నమోదవడం కలవరం రేపుతోంది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వినియోగదారుల ధరల సూచీ గణాంకాల్లో ఈ పరిస్థితి వెల్లడైంది. తెలంగాణ తరువాత ఏపీలో ద్రవ్యోల్బణం 5.72% ఉండగా, తమిళనాడులో 5.44%, మధ్యప్రదేశ్‌లో 4.91%, కర్ణాటకలో 4.89%గా ఉంది. దేశం సగటు ద్రవ్యోల్బణం 4.45%గా నమోదైంది. ఈ పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల కన్నా తెలంగాణలోనే కూరగాయలతోపాటు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

**ఆహార ద్రవ్యోల్బణం కన్నా ఎక్కువగా..**

జూలైలో దేశవ్యాప్తంగా రిటైల్ ద్రవ్యోల్బణం 4.45%గా ఉండగా, ఆహార వస్తువుల ధరలను ప్రతిబింబించే ఆహార ద్రవ్యోల్బణం 5.52%గా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ద్రవ్యోల్బణం మరింత ఎక్కువగా 5.79 శాతంగా నమోదైంది. దీనికి భిన్నంగా తెలంగాణలో మొత్తం ద్రవ్యోల్బణం 6.32%గా ఉండటం రాష్ట్ర ప్రజలపై ధరల భారం ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తోంది. దేశ సగటుతో పోలిస్తే తెలంగాణలో ధరల పెరుగుదల అధికంగా ఉంది. ప్రతి కుటుంబం నెలవారీ వంటింటి ఖర్చులో కనిపిస్తున్న అదనపు భారానికి ఇది అద్దం పడుతోందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హైదరాబాద్ మార్కెట్లలో ఉల్లిగడ్డ కిలో రూ.50-55 పలుకుతోంది. బోయిన్‌పల్లి హోల్‌సేల్ మార్కెట్‌లో అదే ఉల్లి రూ.30-35 మధ్య లభిస్తుండగా, రైతుబజార్లలో రూ.40-44 విక్రయిస్తున్నారు. అదే రిటైల్ మార్కెట్‌కు చేరే కొద్దీ ధర గణనీయంగా పెరుగుతోంది. అలాగే, క్యారట్, చిక్కుడు, బీన్స్, వంకాయలు తదితరాల ధరలు కూడా భారీగా పెరగడంతో కుటుంబాల నెలవారీ కూరగాయల ఖర్చు భారీగా పెరిగింది. పప్పుల ధరలు సైతం సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. బియ్యం ధరలు సైతం బెంబేలెత్తిస్తున్నాయి. మూడు నెలల క్రితం సన్న బియ్యం ధర కిలో రూ.48-55 ఉండగా, ఇప్పుడు 65-70 వరకు ఉన్నాయి.

**రాష్ట్రంలో ప్రభుత్వ జోక్యం అవసరం**

రాష్ట్రంలో హాకా, రైతుబజార్ల ద్వారా సబ్సిడీ ధరలకు ఉల్లి, ఇతర నిత్యావసరాలను అందుబాటులోకి తేవాలనే డిమాండ్ పెరుగుతోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు. ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరిగాయని చెబుతున్న అధికారులు రేట్ల తగ్గింపునకు సంబంధించి ప్రభుత్వానికి ఎలాంటి సూచనలు చేయకపోవడం గమనార్హం. పండుగల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ధరలపై మరింత ఒత్తిడి నెలకొనే అవకాశం ఉంది. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్‌లోకి ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను పెంచడం, రైతుబజార్లలో నిల్వలు పెంచడం, హోల్‌సేల్-చిల్లర ధరల వ్యత్యాసాన్ని పర్యవేక్షించడం, అక్రమ నిల్వలు-కృత్రిమ కొరతపై నిఘా పెంచాల్సిన అవసరం ఉంది.

**ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు**

- ☐ మునుపటి పంట నిల్వలు తగ్గిపోవడం, కొత్త పంట మార్కెట్‌కు రావడానికి ఇంకా సమయం ఉండటం. ఉత్పత్తి తగ్గిన సమయంలో డిమాండ్ పెరగడంతో ధరలపై ఒత్తిడి పెరిగింది.
- ☐ పలు ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా పంట దెబ్బతినడం, పొలాల నుంచి మార్కెట్లకు సరుకు రవాణాలో ఆలస్యం ఏర్పడటం. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాల్లో వర్షాలు పంటల కోత, రవాణాపై ప్రభావం చూపుతున్నాయి.
- ☐ శ్రావణ మాసం, రాబోయే వినాయక చవితి వేళ స్వీట్లు, పిండివంటల తయారీ పరిశ్రమలు, హోటళ్లు, గృహాల నుంచి వినియోగం ఒక్కసారిగా పెరగడం.
- ☐ అంతర్రాష్ట్ర రవాణా వ్యయం పెరగడం వల్ల మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రధాన మార్కెట్ల నుంచి వచ్చే సరుకుపై అదనపు భారంపడింది.
- ☐ భారత్ దిగుమతి చేసుకునే ముడి పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెలపై అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పెరగడం, దిగుమతి సుంకాల్లో మార్పులు.

**ఇంటి ఖర్చులకే సరిపోక..**

హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో రవికిరణ్ అనే ప్రైవేటు ఉద్యోగి భార్య, ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. నెలసరి వేతనం రూ.50 వేలు. గతంలో ఇంటి అద్దె, టూవీలర్ ఖర్చు, కిరాణా, కూరగాయలు, పాలు, పిల్లల చదువు, విద్యుత్, రవాణా, ఇతర ఖర్చులకు కలిపి సుమారు రూ.45 వేలు ఖర్చయ్యేవి. నెలకు రూ.5 వేలు పొదుపు చేసుకునేవారు. ఇప్పుడు కూరగాయలు, ఉల్లి, పప్పులు, నూనె, పాల ధరలు పెరగడంతో నెల ఖర్చు రూ.50 వేలకుపైగా అవుతోంది. ముఖ్యంగా కూరగాయలు, కిరాణాపై నెలకు రూ.3వేల వరకు అదనంగా ఖర్చవుతోంది. దీంతో గతంలో పొదుపు చేసిన రూ.5 వేలు ఇప్పుడు ఇంటి ఖర్చులకే సరిపోని పరిస్థితి. పిల్లల వినోదం, కొత్త దుస్తులు, బయట భోజనాలు తగ్గించడంతోపాటు పొదుపును కూడా వదులుకోవాల్సి వస్తోంది.

# ఇరుముడి హిట్.. రవితేజ కీలక నిర్ణయం!



వరుస పరాజయాలతో సతమతమవుతున్న హీరోకు ఒక్క హిట్ పడితే చాలు.. మళ్లీ పుంజుకోవడానికి అదే విజయమే ఊతమవుతుంది. ఇప్పుడు రవితేజ విషయంలోనూ ఇదే జరుగుతోంది. 'ఇరుముడి'తో హిట్ ట్రాక్ ఎక్కిన మాస్ మహారాజా.. దాదాపు నాలుగేళ్ల తర్వాత రూ.100 కోట్ల వసూళ్లను అందుకున్నాడు. 'ధమాకా'(2022) తర్వాత ఆయన నటించిన ఆరు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయాయి. కొన్ని సినిమాలైతే కనీస ఓపెనింగ్స్ కూడా రాబట్టలేకపోయాయి. దీంతో రవితేజ సినిమా వస్తుందంటే గతంలో కనిపించినంత హడావుడి కూడా కనిపించేది కాదు. కానీ 'ఇరుముడి' మాత్రం ఆ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసింది. రవితేజలో మళ్లీ జోష్ నింపడమే కాకుండా.. ఆయన మార్కెట్‌పై కూడా కొత్త నమ్మకాన్ని తీసుకొచ్చింది. దీంతో వచ్చిన విజయాన్ని ఎలాగైనా కొనసాగించాలని భావిస్తున్న రవితేజ.. తన లైనప్‌పై కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

### 'ఇరుముడి' ఇచ్చిన ఊపు

'ఇరుముడి' ఇంతటి బ్లాక్‌బస్టర్ కావడం అభిమానులకు మాత్రమే కాదు.. రవితేజకు కూడా ఎక్కడ లేని హుషారు తెచ్చిందట. హిట్ అయితే చాలనుకున్న సినిమాకు ఏకంగా రికార్డు స్థాయి వసూళ్లు(8 రోజుల్లో రూ. 150 కోట్ల గ్రాస్) రావడంతో ట్రేడ్ వర్గాల్లోనూ ఈ సినిమా గురించే చర్చ జరుగుతోంది. రెండో వారంలో 'టాక్సిక్' కారణంగా స్క్రీన్లు తగ్గినా.. ఆ సినిమా టాక్ ప్రభావంతో 'ఇరుముడి'కి మళ్లీ షోలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఇలాంటి భారీ విజయం తర్వాత హీరోలు మరింత ఆచితూచి అడుగులు వేయాల్సి ఉంటుంది. ఒక్కసారి వచ్చిన సక్సెస్‌ను కొనసాగించాలంటే తర్వాతి సినిమాల విషయంలో మరింత జాగ్రత్త అవసరం. ఇప్పుడు రవితేజ కూడా ఇదే ఫార్ములాను ఫాలో అవుతున్నట్లు టాక్.

### రవితేజ చేతిలో రెండు క్రేజీ ప్రాజెక్టులు

ప్రస్తుతం రవితేజ చేతిలో రెండు కీలక ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో ఒకటి శ్రీవిష్ణుతో కలిసి దిల్ రాజు నిర్మాణంలో హసిత్ గోలి తెరకెక్కించనున్న ఎంటర్‌టైనర్. ఈ సినిమాకు 'దాగుడుమూతల దండాకోర్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. మరోవైపు 'సరిపోదా శనివారం' ఫేమ్ వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో నిర్మాత లక్ష్మణ్ నిర్మించనున్న భారీ ప్రాజెక్ట్ కూడా ఉంది. ఈ చిత్రానికి కొంత హారర్ టచ్ ఉంటుందని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

అయితే వరుస ప్రకారం చూస్తే ముందుగా హసిత్ గోలి సినిమా సెట్స్‌పైకి వెళ్లాల్సి ఉంది. అయితే 'ఇరుముడి' తర్వాత రవితేజకు వచ్చిన సక్సెస్‌ను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు లెక్కలు మారుతున్నట్లు సమాచారం. ముందుగా వివేక్ ఆత్రేయ సినిమాను పట్టాలెక్కించే ఆలోచనలో ఉన్నట్లు టాక్. అయితే రెండు సినిమాలను సమాంతరంగా చేయడం కూడా ఒక ఆప్షన్‌గానే ఉన్నప్పటికీ.. రవితేజ లుక్‌లో మార్పులు చేయాల్సి రావడంతో అది అంత సులభం కాదని తెలుస్తోంది. మరోవైపు హసిత్ గోలి తెరకెక్కించనున్న ఎంటర్‌టైనర్‌లో కొన్ని కీలక మార్పులు చేయాల్సి ఉందని సమాచారం. స్క్రిప్ట్‌పై మరింత వర్క్ చేయడానికి సమయం అవసరం కావడంతో ఆ సినిమాను కొంత ఆలస్యం చేసే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న చర్చలు నిజమైతే.. సెప్టెంబర్ మూడో వారం లేదా అక్టోబర్‌లో వివేక్ ఆత్రేయ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం. అదే సమయంలో హసిత్ గోలి సినిమా మొదలైతే సంక్రాంతి విడుదలను టార్గెట్‌గా పెట్టుకుని షూటింగ్ పూర్తి చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇవన్నీ ప్రస్తుతానికి ఇండస్ట్రీ వర్గాల్లో జరుగుతున్న చర్చలే తప్ప అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. ఏదేమైనా 'ఇరుముడి' విజయం రవితేజ ఆలోచనా విధానంలో మాత్రం గణనీయమైన మార్పు తీసుకొచ్చినట్లు కనిపిస్తోంది.



## క్రిస్మస్‌కు 'కింగ్ 100'

అగ్ర కథానాయకుడు నాగార్జున వందో చిత్రానికి 'కింగ్ 100' అనే పేరుని ఖరారు చేశారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై అక్కినేని కుటుంబం నిర్మిస్తోంది. రా.కార్తీక్ దర్శకుడు. టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. నాగార్జున పుట్టినరోజుని పురస్కరించుకుని శనివారం సినిమా పేరుతో కూడిన ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. 'మనుషుల్లో రెండు రకాలు. డబ్బున్నోళ్లు, డబ్బు లేనోళ్లు. డబ్బు లేనప్పుడు నన్ను లూజర్ అన్నారు. డబ్బు ఉన్నప్పుడు కింగ్ అని పిలిచారు...' అనే సంభాషణలతో ఈ ప్రచార చిత్రం సాగుతోంది. ఈ గుర్తింపు డబ్బు కంటే ఎంతో శక్తిమంతమైనదనీ, దాన్ని నిలబెట్టుకోవడం కోసం పరుగెడుతూనే ఉండాలన్నదే ఇందులో కథానాయకుడు నమ్మి అనుసరించే మార్గం. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో హీరో నాగార్జున స్టైలిష్ అవతారంలో కనిపించనున్నట్టు ప్రచార చిత్రం చాటుతోంది. డబ్బు, మోసాలతో ముడిపడిన కథతో రూపొందిన సినిమా అని తెలుస్తోంది. ప్రచార చిత్రంతోపాటే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. నాగార్జునకు బాగా అచ్చొచ్చిన డిసెంబరు నెలలోనే ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ సినిమాకి దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

## వెంకీ ఫ్యాన్స్ కు షాక్... ఆదర్శ కుటుంబం వాయిదా?

విక్టరీ వెంకటేష్ తాజాగా చేసిన సినిమా ఆదర్శ కుటుంబం. ఈ సినిమా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కింది. రిలీజ్ కు సిద్ధంగా ఉంది. అయితే ఇంతలోనే వెంకీ మామ అభిమానులకు ఊహించని షాక్ తగిలింది. ఈ మూవీ వాయిదా పడబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ముందుగా అనుకున్న ప్రకారం అక్టోబర్ రెండవ తేదీన ఈ సినిమా రిలీజ్ కావాలి. కానీ 9వ తేదీన విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. అక్టోబర్ 16వ తేదీని పరిశీలిస్తున్నట్లు కూడా సమాచారం. దీనిపై త్వరలోనే ఓ అధికారిక ప్రకటనతో చిత్ర బృందం రానున్నట్లు తెలుస్తోంది. కాగా ఆదర్శ కుటుంబం సినిమాలో విక్టరీ వెంకటేష్ హీరోగా చేయగా... శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా మెరువనున్నారు. అటు నారా రోహిత్ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు.





## సందడిగా 'ధర్మస్థల నియోజకవర్గం' ట్రైలర్ లాంచ్

సుమన్, సాయికుమార్, వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'ధర్మస్థల నియోజకవర్గం'. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వం వహించారు. మేరుం భాస్కర్ నిర్మాత. పొలిటికల్ ఎంటర్‌టైనర్ కథతో తీశారు. సెప్టెంబర్ 4న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ వదిలారు. హైదరాబాద్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. హీరోయిన్ వితికా షేరు మాట్లాడుతూ.. ఈ చిత్రంలోని పాటలు విన్న తర్వాతే కథ విన్నాను. పాటలు, కథ బాగా నచ్చి ఈ సినిమా చేసేందుకు ముందుకొచ్చాను. సినిమాలకు గ్యాప్ ఇచ్చాను కానీ ఇందులో డిఫరెంట్ క్యారెక్టర్ వచ్చింది కాబట్టే ఒప్పుకున్నాను అని చెప్పింది.



## హీరోయిన్లను మాత్రమే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?

సినీ పరిశ్రమలో హీరోయిన్లు ఎదుర్కొనే వివక్ష, అలాగే తన సహనటుడు రాకింగ్ స్టార్ యశ్ నిజ జీవిత వ్యక్తిత్వం గురించి బాలీవుడ్ భామ తారా సుతారియా టాక్ షోలో భాగంగా ఆసక్తికర విషయాలను వెల్లడించారు. వెండితెరపై ఎంతో కోపంతో, మాస్ అండ్ ఆల్ఫా మేల్ క్యారెక్టర్లలో కనిపించే యశ్ నిజ జీవితంలో మాత్రం చాలా భిన్నమైన వ్యక్తి అని తార చెప్పారు. బయట ఆయన చాలా సెన్సిటివ్ అని, తన కంటే ఎక్కువగా ఎదుటివారి సౌకర్యం గురించి, వారి భావాల గురించి ఆలోచిస్తారని తెలిపారు. సినీ పరిశ్రమలో ఎదుటివారిని అంతగా గౌరవించే మంచి మనసున్న వ్యక్తులు దొరకడం చాలా అరుదని, తాను కలిసిన నటుల్లో యశ్ ఎంతో ప్రత్యేకమైనవారని, ప్రతీ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉంటారని ప్రశంసించారు. అలాగే ఇండస్ట్రీలో హీరోయిన్ల మధ్య జరిగే నిరంతర పోలికల పై కూడా తార అసహనం వ్యక్తం చేశారు. మన పరిశ్రమలో ప్రతీ నటి తనకంటూ ఒక ప్రత్యేక శైలిని కలిగి ఉంటుందని, అందరూ వేర్వేరు పాత్రలు చేస్తూ తమ ప్రతిభను చాటుకుంటారని తెలిపారు. అలాంటప్పుడు ఒకరితో మరొకరిని పోల్చడం ఎంతమాత్రం సరికాదని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో నిరంతరం నటీమణుల మధ్యే ఈ హీరోయిన్ బెటరా? ఆ హీరోయిన్ బెటరా? అంటూ పోలికలు తెస్తూ పోటీ పెడతారని, కానీ విచిత్రం ఏమిటంటే మగ హీరోల విషయంలో మాత్రం అలాంటి పోలికలను ఎవరూ చేయరని ఆమె సూటిగా ప్రశ్నించారు. హీరోల మధ్య ఎప్పుడూ ఇలాంటి సరిపోలికలు తీసుకురాకుండా, కేవలం నటీమణులనే ఎందుకు టార్గెట్ చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హీరోలకు ఓ న్యాయం.. హీరోయిన్లకు ఓ న్యాయమా అని అన్నారు.



## నటనకు అవకాశం ఉన్నపాత్ర చేశాను

సుమన్, సాయికుమార్, వరుణ్ సందేశ్, వితికా షేరు, నటరాజ్, రాయంచ కొక్కుర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. జై జ్ఞానప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మించారు. ఈ మూవీ పీవీఆర్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా సెప్టెంబరు 4న విడుదల కానుంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో జై జ్ఞానప్రభ



మాట్లాడుతూ– ''పొలిటికల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ఇది. మహావీర్ మ్యూజిక్, చంద్రబోస్‌గారి సాహిత్యం మా సినిమాకు ఆకర్షణగా నిలుస్తాయి. మా సినిమా ప్రేక్షకుల్ని ఏమాత్రం నిరాశపరచదు'' అని చెప్పారు. ''మా మూవీ ఔట్‌పుట్ అందరికీ నచ్చేలా వచ్చింది... ప్రేక్షకాదరణ దక్కుతుందని ఆశిస్తున్నాం'' అని మేరుం భాస్కర్ తెలిపారు. ''ఇటీవల నటనకు విరామం ఇచ్చాను. అయితే 'ధర్మస్థల నియోజకవర్గం'లో డిఫరెంట్ క్యారెక్టర్ రావడంతో ఒప్పుకున్నాను. నటనకు మంచి స్కోప్ దక్కింది'' అని వితికా షేరు పేర్కొన్నారు. రచయిత చంద్రబోస్, మ్యూజిక్ డైరెక్టర్ మహావీర్ ఏలేందర్, ఆర్ట్ డైరెక్టర్ భార్గవాచారి నౌండ్ల, నటులు శివకుమార్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 'యేష నాగుల కట్ట మీద' సాంగ్‌తో సోషల్ మీడియా షేక్!

నేచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో సూపర్ హిట్ 'దసరా' తర్వాత వస్తున్న భారీ యాక్షన్ సినిమా 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాకు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, మొదటి పాట 'ఆయా షేర్' పెద్ద హిట్ కాగా, తాజాగా ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ 'యేష నాగుల' అని సాగే పాటను విడుదల చేశారు. అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన అనిరుధ్ లైవ్ కాన్సర్ట్‌లో వేలాది మంది అభిమానుల మధ్య ఈ పాటను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. మన ఊరి జానపద లిరిక్స్‌కు అనిరుధ్ తనదైన శైలిలో అదిరిపోయే మాస్ బీట్స్ జోడించారు. కాసర్ల శ్యామ్ రాసిన లిరిక్స్ పక్కా లోకల్ ఫీల్‌ను తేవడమే కాకుండా, జంగి రెడ్డి, ప్రభల గొంతు పాటకు మంచి ఊపును తెచ్చింది. ఆట సందీప్ కొరియోగ్రఫీ చేసిన మాస్ స్టెప్పులు విజువల్‌గా చాలా బాగున్నాయి. అయితే ఈ పాటలో నాని వేసిన మాస్ డ్యాన్స్ స్టెప్పులు, ఆయన యాటిట్యూడ్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ పాటలో మెరిసిన కీర్తి సురేష్ తన గ్లామర్‌తో నానికి పర్ఫెక్ట్ జోడీగా నిలిచారు. తెలంగాణ జానపదానికి మరింత హుషారెత్తించే బీట్ డ్యాన్స్ చేసే ఊపునిస్తోంది. అలాగే ఈ సాంగ్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. కేవలం సినిమాలో మాత్రమే కాకుండా ప్రతీ పార్టీలో, పండుగల్లో మార్మోగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా.. ఈ సినిమాలో మోహన్ బాబు, కాయదు లోహర్, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, తనికెళ్ల భరణి కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఇక ఈ భారీ చిత్రాన్ని సెప్టెంబర్ 24న తెలుగు, తమిళం, హిందీతో పాటు ఇంగ్లిష్, స్పానిష్‌లతో కలిపి మొత్తం 8 భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు మేకర్స్.



# డెవాల్డ్ బ్రెవిస్ విధ్వంసం..
## జింబాబ్వేపై సౌతాఫ్రికా ఘన విజయం

పసికూన నమీబియా ఇచ్చిన షాక్ నుంచి తేరుకున్న సౌతాఫ్రికా టీ20 ట్రై సిరీస్‌లో బోణీ కొట్టింది. శనివారం విండ్‌హోక్ వేదికగా జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. జింబాబ్వే విధించిన 145 పరుగుల టార్గెట్‌ను సఫారీలు 13.4 ఓవర్లలోనే 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. డెవాల్డ్ బ్రెవిస్ (32 బంతుల్లో 75 నాటౌట్, 7 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసం సృష్టించి ఒంటిచేత్తో జట్టుకు విజయాన్ని అందించాడు. ఓపెనర్లు ప్రిటోరియస్ (22), జోర్డాన్ హెర్మన్ (20) పర్వాలేదనిపించారు. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవన్స్, బ్లెసింగ్ ముజరబానీ, నైమురి తలా ఒక వికెట్ పడగొట్టారు. అంతకముందు జింబాబ్వే 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (34) టాప్ స్కోరర్ కాగా, మరుమనీ (13 బంతుల్లో 30, ఒక ఫోర్, మూడు సిక్సర్లు) ఆఖర్లో మెరవడంతో జింబాబ్వే గౌరవప్రదమైన స్కోరును సాధించింది. సౌతాఫ్రికా బౌలర్లలో డాన్ జాసెన్ 3 వికెట్లు తీయగా, సుబ్రయెన్ 2 వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో సౌతాఫ్రికా సిరీస్‌లో బోణీ కొట్టగా, తర్వాతి మ్యాచ్ సోమవారం జింబాబ్వే, నమీబియా మధ్య జరగనుంది.

# ఆసియా క్రీడలకు ముందే బిగ్‌షాక్.. పతకం పోయినట్లే!




ఆసియా క్రీడల ప్రారంభానికి ముందే భారత్‌కు బిగ్ షాక్ తగిలింది. భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా గాయంతో ఆసియా గేమ్స్ నుంచి వైదొలిగితే, తాజాగా అథ్లెటిక్ బృందంలో కీలక అథ్లెట్ అయిన అభిషేక్ పాల్ గేమ్స్‌లో పాల్గొనడం అనుమానంగా మారింది. అభిషేక్ నిషేధిత పదార్థం తీసుకున్నట్లు తేలడంతో జాతీయ డ్రగ్స్ నిరోధక సంస్థ (నాడా) అతడికి నోటీసులు జారీ చేసింది.

నిషేధిత పదార్థం తీసుకోవడం వెనుక కారణమేంటన్నది వెల్లడించాలని అభిషేక్‌ను నాడా కోరింది. ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడలకు ఎంపికైన 72 మంది బృందంలో ఒకడైన అభిషేక్ పాల్ ఒకడు. మారథాన్ రన్నరైన అతడు 5,000 మీటర్లు, 10,000 మీటర్ల పరుగులో బరిలోకి దిగనున్నాడు. అయితే తాజాగా నిషేధిత పదార్థం తీసుకున్నట్లు తేలినప్పటికీ, అది మోతాదులోనే ఉన్నప్పటికీ కూడా నాడా నోటీసులు జారీ చేయడం ఆసక్తి కలిగించింది.

''అభిషేక్‌కు డోపింగ్ టెస్ట్ నిర్వహించాం. అతడి రక్త నమూనాల్లో నిషేధిత పదార్థం కొద్ది మొత్తంలో కనిపించింది. సంతానం కోసం మహిళలు ఉపయోగించే ఫర్టిలిటీ డ్రగ్ అది. అందుకని.. ఆ పదార్థం తన నమూనాల్లో ఉండడం అతడిని ఆశ్చర్యానికి గురి చేసింది. అందుకే అతడికి నోటీసులు పంపించాం'' అని నాడా తెలిపింది.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మారథాన్ రన్నర్‌గా రాణిస్తున్న అభిషేక్ పాల్.. 2023 ఆసియా ఛాంపియన్‌షిప్స్10వేల మీటర్ల పరుగులో కాంస్యంతో మెరిశాడు. జపాన్‌లోని ఐచీ - నగోయ వేదికగా సెప్టెంబర్ 19వ తేదీ నుంచి ఆసియా క్రీడలు మొదలవ్వనున్నాయి.

## మహిళల టీ20 ఆసియాకప్.. భారత్ జోరందుకునేనా?

దుబాయ్: ఈ ఏడాది టీ20 క్రికెట్లో మెరుగైన ప్రదర్శన చేయలేకపోయిన భారత మహిళల జట్టు.. జోరందుకోవాలనే లక్ష్యంతో మహిళల టీ20 ఆసియాకప్‌కు సిద్ధమైంది. గ్రూప్‌ఎలో ఆదివారం థాయ్‌లాండ్‌తో పోరుతో టైటిల్ వేటను ఆరంభిస్తుంది. మహిళల ఆసియాకప్‌లో భారత్‌కు మంచి రికార్డు ఉంది. టీ20 ఫార్మాట్లో జరిగిన అయిదు టోర్నీల్లో జట్టు మూడుసార్లు టైటిల్ గెలిచింది. కానీ ప్రస్తుత ఫామ్ మాత్రం గొప్పగా లేదు. హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ఈ ఏడాది ఆడిన 16 టీ20 మ్యాచ్‌ల్లో 9 ఓడింది. టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. వచ్చే నెలలో ఆసియా క్రీడలు కూడా ఉండడంతో ఫామ్‌ను అందుకోవడం, నిలకడ సాధించడం భారత్‌కు చాలా అవసరం. హర్మన్‌ప్రీత్ కౌర్ ఫామ్‌పైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆమె సత్తా చాటాల్సివుంది. స్మృతి మంధాన, షెఫాలి వర్మతో భారత ఓపెనింగ్ బలంగానే ఉంది. ఆ తర్వాత వచ్చే బ్యాటర్లు జోరు కొనసాగిస్తారా అన్నదే ప్రశ్న. భారత జట్టు ఫీల్డింగ్ కూడా బాగా మెరుగుపడాల్సివుంది. తెలుగమ్మాయి శ్రీచరణి, దీప్తి శర్మలతో భారత స్పిన్ విభాగం బలంగా కనిపిస్తోంది. వాళ్లకు తోడుగా రాధ యాదవ్ కూడా ఉంది. రేణుక సింగ్, అరుంధతి, క్రాంతి గౌడ్, నందని శర్మలతో భారత పేస్ బౌలింగ్ కూడా పదునుగానే ఉంది. వీళ్లలో ఎవరు తుది జట్టులో ఉంటారో చూడాలి. పసికూన థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు పెద్దగా ప్రతిఘటన ఎదురుకాకపోవచ్చు. గ్రూప్ ఎలో భారత్, థాయ్‌లాండ్‌తో పాటు హాంకాంగ్, పాకిస్థాన్ ఉన్నాయి. పాకిస్థాన్ మాత్రమే కాస్త గట్టి ప్రత్యర్థి.



# ఇంగ్లండ్‌కు భారీ ఆధిక్యం.. పాక్‌కు ఓటమి తప్పదా?

లార్డ్స్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లండ్ భారీ ఆధిక్యం దిశగా కొనసాగుతోంది. పలుమార్లు వర్షం అంతరాయం కలిగించినప్పటికీ ఇంగ్లండ్ 350 పరుగుల లీడ్‌కు చేరువలో ఉంది. టీ విరామ సమయానికి ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులతో ఆడుతోంది. డాన్ లారెన్స్ (37), గస్ అకిన్‌సన్ (7) పరుగులతో క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం ఇంగ్లండ్ 342 పరుగుల భారీ ఆధిక్యంలో కొనసాగుతోంది. ఆటకు మరో రెండు రోజులు సమయం ఉండడంతో పాక్‌కు మరో ఓటమి తప్పేలా లేదనిపిస్తోంది. నాసిరకం బ్యాటింగ్‌తో ఇబ్బంది పడుతున్న పాకిస్తాన్ లార్డ్స్ పిచ్‌పై రెండో బ్యాటింగ్ చేసి 350కి పైగా పరుగుల టార్గెట్‌ను ఛేదించడం కష్టం, ఆ జట్టు బ్యాటర్లు ఇప్పుడున్న ఫామ్ దృష్ట్యా అసాధ్యమని చెప్పొచ్చు.

మూడో రోజు ఆటకు వరుణుడు పదే పదే అడ్డు తగలడంతో ఇంగ్లండ్‌కు బ్యాటింగ్‌కు పెద్దగా అవకాశం రాలేదు. ఓవర్‌నైట్ స్కోరు 813తో మూడోరోజు ఆట మొదలైన కాసేపటికే ఇంగ్లండ్ రూట్ (24) రూపంలో నాలుగో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత వరుణుడు దంచికొట్టడంతో ఆట నిలిచిపోయింది. వర్షం విరామం అనంతరం ఆట మొదలవ్వగా, హ్యారీ బ్రూక్ (34), డాన్ లారెన్స్ (37 బ్యాటింగ్) ఐదో వికెట్‌కు 45 పరుగులు జోడించారు. ఆ తర్వాత జేమీ స్మిత్ (7) తొందరగానే ఔటయ్యాడు. మరోసారి వర్షం దంచికొట్టడంతో ఇంగ్లండ్ టీ విరామానికి వెళ్లింది. పాక్ బౌలర్లలో మొహమ్మద్ అబ్బాస్ 3 వికెట్లు తీయగా, కుర్రమ్ షెహజాద్ 2 వికెట్లు పడగొట్టాడు.



# చెస్ ఆడాలని చాలెంజ్.. 'సారీ బ్రో రిటైరయ్యా'

భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ దొమ్మరాజు 2024లో క్లాసికల్ వరల్డ్ చెస్ టైటిల్ గెలిచిన తర్వాత మరో టైటిల్ సాధించలేకపోయాడు. ఆ తర్వాత నుంచి గుకేశ్ ఫామ్ లేమితో సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలో గుకేశ్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆసక్తికర స్టోరీని పంచుకున్నాడు.

'ఒక క్రిటిక్ తనతో చాట్‌లో భాగంగా రిటైర్ అవ్వమని సలహా ఇచ్చాడు. ఇప్పుడు అదే క్రిటిక్ తనతో చెస్ ఆడాలని చాలెంజ్ చేశాడు. కానీ నేను తెలివిగా అతడికి సారీ, నేను రిటైర్ అయ్యా కదా బ్రో' అని సమాధానం ఇచ్చాను' అని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం గుకేశ్ ఇన్‌స్టా స్టోరీ ట్రెండింగ్‌గా మారిపోయింది. ఇక గుకేశ్ ప్రస్తుతం ఉజ్బెకిస్తాన్‌లో చెస్ ఒలింపియాడ్ 2026లో బిజీగా గడుపుతున్నాడు.

ఇక ఏడాది వ్యవధిలో ఫామ్‌లేమితో గుకేశ్ 73 రేటింగ్ పాయింట్లు కోల్పోయి ప్రస్తుతం ఫిడే ర్యాంకింగ్స్‌లో 32వ స్థానంలో కొనసాగుతున్నాడు. గుకేశ్ ఖాతాలో 2,703 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. గత 10 గేముల్లో గుకేశ్ ఒక్క మ్యాచ్ మాత్రమే విజయం సాధించడం విశేషం.

# ఐదో స్థానం.. అయినా రూ. 50 లక్షల నజరానా ఎందుకంటే?

మహిళల హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టు ఐదో స్థానంలో నిలిచింది. సెమీ ఫైనల్ చేరడంలో విఫలమైనప్పటికీ.. జర్మనీతో మ్యాచ్‌లో మాత్రం సలీమా టెటె బృందం సత్తా చాటింది. ఐదు, ఆరో స్థానం కోసం జరిగిన వర్గీకరణ పోటీలో పటిష్ట జర్మనీని 31తో ఓడించింది.

**52 ఏళ్ల తర్వాత**

తద్వారా ఐదో స్థానాన్ని కైవసం చేసుకోగలిగింది. కాగా 1974లో తొలిసారి నిర్వహించిన హాకీ వరల్డ్‌కప్‌లో అత్యుత్తమంగా నాలుగోస్థానంలో నిలిచిన భారత జట్టు మళ్లీ 52 ఏళ్ల తర్వాత మెరుగైన ప్రదర్శన చేసింది. ర్యాంకింగ్ పరంగా తొమ్మిదో స్థానంలో ఉన్న మహిళల జట్టు.. ఐదో ర్యాంకులో ఉన్న జర్మనీని ఓడించి సత్తా చాటింది.

**ఒకే ఒక్క ఓటమి**

ఇక ఈ మెగా ఈవెంట్‌లో పూల్ 'డి' నుంచి భారత మహిళా జట్టు బరిలోకి దిగింది. సౌతాఫ్రికాపై 61తో అద్భుత విజయం సాధించిన సలీమా టెటె బృందం.. తొలి దశలో అగ్రశ్రేణి జట్లు చైనా, ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లు డ్రా చేసుకుంది. అయితే, రెండో దశలో డిఫెండింగ్ చాంపియన్ నెదర్లాండ్స్ చేతిలో మాత్రం భారత జట్టు ఓడిపోయింది.

ఈ క్రమంలో సెమీస్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడ్డ భారత్.. 'డ్రా'కు పరిమితమైంది. ఫలితంగా సెమీస్‌కు దూరమైంది. ఇదిలా ఉంటే.. రెండుసార్లు ప్రపంచకప్ గెలిచిన జర్మనీని ఓడించి ఐదో స్థానంలో నిలిచి.. అత్యుత్తమ ప్రదర్శనతో మెరిసింది.

**రూ. 50 లక్షల నజరానా.. అందుకే**

ఈ నేపథ్యంలోనే హాకీ ఇండియా (HI) భారత మహిళా జట్టుకు ప్రోత్సాహకంగా రూ. 50 లక్షల నజరానా ప్రకటించింది. అదే విధంగా.. వరల్డ్‌కప్‌లో చక్కటి ఆటతీరు కనబర్చిన ప్లేయర్లను హెచ్ఐ అధ్యక్షుడు దిలీప్ టిర్కీ అభినందించారు. ''భారత మహిళ హాకీ చరిత్రలో ఇదొక గొప్ప ఫలితం. దాదాపు 52 ఏళ్ల తర్వాత తొలిసారి జట్టు ఐదో స్థానం కైవసం చేసుకుంది.

పట్టుదల, వైఫల్యాల నుంచి త్వరగా తేరుకునే తత్వం, పోరాట పటిమకు ఈ జట్టు నిదర్శనం. టోర్నీ ఆసాంతం ఆకట్టుకున్నారు. హాకీ ఇండియా తరఫున.. జట్టును ప్రశంసిస్తూ రూ. 50 లక్షల నజరానా ప్రకటిస్తున్నాం. ఆటగాళ్లు ప్రతీసారి ఇలాగే అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ఇది ఒక ప్రోత్సాహకం లాంటిది'' అని దిలీప్ టిర్కీ పేర్కొన్నారు.







# బుమ్రా, పాండ్యా విషయంలో కీలక అప్‌డేట్!

శ్రీలంకతో టెస్టు సిరీస్ ముగించుకున్న టీమిండియా స్వదేశానికి చేరుకుంది. సెప్టెంబర్ 13 నుంచి 17 మధ్య అఫ్గానిస్తాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. అయితే ఈ సిరీస్‌తో పాటు సెప్టెంబర్ 19న మొదలుకానున్న ఆసియా గేమ్స్‌లో టీమిండియా పురుషుల జట్టు మ్యాచ్‌లు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 3 వరకు జరగనున్నాయి. అయితే ఈ రెండు టోర్నీలకు భారత జట్టులో కీలకమైన స్పీడస్టర్ బుమ్రా, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఆడే విషయమై ఇంకా ఎలాంటి ప్రకటన రాలేదు. ప్రస్తుతం ఈ ఇద్దరు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లోనే రీహాబిలిటేషన్‌లో గడుపుతున్నారు. బుమ్రా ఎడమ మోకాలి గాయంతో బాధపడుతుండగా, పాండ్యా వెన్నునొప్పి నుంచి కోలుకున్నప్పటికీ, కాలి పిక్క కండరాల గాయం తిరగబెట్టడంతో సీవోఈలోనే ఉండిపోయాడు.

తాజా నివేదికల ప్రకారం ఈ ఇద్దరి గాయాలపై కానీ, ఎప్పుడు కోలుకుంటారనే దానిపై కానీ ఎలాంటి అప్‌డేట్స్ రాలేదు. మరోవైపు అఫ్గానిస్తాన్‌తో టీ20 సిరీస్‌కు వీరిద్దరు ఆడకపోవచ్చు. ఇక ఆసియా గేమ్స్‌కు కూడా టీమిండియాబి జట్టును పంపే యోచనలో ఉన్నట్లు బీసీసీఐ ఇప్పటికే పేర్కొంది.

మరి అప్పటివరకు బుమ్రా, పాండ్యా కోలుకుంటే ఆసియా గేమ్స్‌లో ఆడుతారా అంటే అది కూడా అనుమానమే. బి జట్టును సిద్ధం చేస్తే మాత్రం బుమ్రా, పాండ్యాలు మరికొంత కాలం రీహాబిలిటేషన్ కేంద్రంలోనే గడపాల్సి ఉంటుంది. మరోవైపు గాయం నుంచి కోలుకున్న ప్రిన్స్ యాదవ్ అఫ్గన్‌తో టీ20 సిరీస్‌కు అందుబాటులో ఉండనున్నట్లు సమాచారం అందింది. ఇది భారత పేస్ బౌలింగ్ దళానికి గుడ్‌న్యూస్ అని చెప్పొచ్చు.